UNIVERSAL
LIBRARY
OU_204920
UNIVERSAL
LIBRARY

మాళవికాగ్నిమిత్రము,

ఇది

చెన్నపురిరాజధానియందల్లి దొరతనపువారి కాలేజీలో

తెనుఁగు పండితుఁడుగానుండిన

కందుకూరి వీరేశలింగము చేత

రచియింపఁబడినది.

రాజమహేంద్రవరమున

పి. ప్రకాశరావు అండ్ బ్రదర్సువారి

శ్రీరామముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1938

కాపీరైటు రిజిష్టరుబడ్డ] [వెల రు. 0-6-0

మొదటి కూర్పు పీఠిక.

మాళవికాగ్నిమిత్రము కథ మిక్కిలి యింపయినది. ఈ నాటకము గీర్వాణకవి మండలాగ్రగణ్యుఁడయిన కాళిదాసునిచే రచియింపఁబడినది. ఇది యభిజ్ఞాన శాకుంతలమును రచియించిన కాళిదాసునిచేతఁగాక మఱియొక కాళిదాసునిచేత రచియింపఁబడినదని కొందఱు చెప్పుదురుగాని యందుకుతగిన నిదర్శనమేదియు లేదు. ఇందలి కథానాయకుఁడగ్నిమిత్రుఁడు. ఇతఁడు శుంగవంశపురాజయిన పుష్పమిత్రునికుమారుఁడు. ఈపుష్పమిత్రుఁడు మొదట మగధదేశపురాజయిన బృహద్రథుని సేనాధిపతిగానుండి యతనిని చంపి, పూర్వమంత్రిని చెఱయందుఁబెట్టించి, ఆతనిరాజ్యము నాక్రమించుకొని విదిశానగరము తనకురాజధానిగా చేసికొనెను. అందుచేత నేయాతనికి సేనాధిపతియని పేరుండెను. ఇతఁడు విక్రమార్కశకమునకు పూర్వము నూట యిరువదిరెండు సంవత్సరముల క్రిందట సింహాసనమునకువచ్చెను. ఇతఁడు సింధునది సమీపమున గ్రీకుదేశస్థులతో యుద్ధము చేసి వారిని జయించెను. ఇతఁడు తనవార్ధకదశయందు తనకుమారుఁడయిన యగ్నిమిత్రునకు రాజ్యమిచ్చి తానాధ్యాత్మికవిషయమున కాలముగడుపుచుండెను. ఈకాలములో తండ్రికిని కొమారునికిని కొన్నివిషయములందు పడకపోయెను. అగ్నిమిత్రుఁడు ముప్పదియాఱు సంవత్సరములు రాజ్యముచేసి మృతినొందఁగా, అనంతర మాతనికొమరుఁడు వసుమిత్రుఁడు రాజ్యమునకువచ్చి యెనిమిది సంవత్సరములు పాలనముచేసెను.

ఈమాళవికాగ్నిమిత్రము నాకు మూడు ప్రతులు లభించినవి. ఈదేశపుప్రతికిని వంగదేశపు ప్రతికిని బహుస్థలములయందు భేదము కనఁబడుచున్నది. నేను దీనిని తెనిఁగించుటలో విశేషభాగము వంగదేశపుపండితుఁడయిన తారానాథతర్కవాచస్పతిప్రతి ననుసరించినను, అక్కడక్కడ కొన్ని స్థలములయం దీదేశపుపాఠము ననుసరించికొన్ని మార్పులను సహితముచేసినాను. గుణగ్రహణపారీణులు దీనియందలి దోషములను క్షమించి గుణమును గ్రహింతురుగాక!

రాజమహేంద్రవరము,
ది ౧౬ ఏప్రియల్ ౧౮౮౫ సం॥ } కందుకూరి వీరేశలింగము.

మొదటి కూర్పు పీఠిక.

మాళవికాగ్నిమిత్రము కథ మిక్కిలి యింపయినది. ఈ నాటకము గీర్వాణకవి మండలాగ్రగణ్యుఁడయిన కాళిదాసునిచే రచియింపఁబడినది. ఇది యభిజ్ఞాన శాకుంతలమును రచియించిన కాళిదాసునిచేతఁగాక మఱియొక కాళిదాసునిచేత రచియింపఁబడినదని కొందఱు చెప్పుదురుగాని యందుకుతగిన నిదర్శనమేదియును లేదు. ఇందలికథానాయకుఁ డగ్నిమిత్రుఁడు. ఇతఁడు శుంగవంశపురాజయినపుష్పమిత్రునికుమారుఁడు. ఈపుష్పమిత్రుఁడు మొదట మగధదేశపురాజయిన బృహద్రథుని సేనాధిపతిగానుండి యతనిని చంపి, పూర్వమంత్రిని చెఱయందుఁబెట్టించి, ఆతనిరాజ్యమునాక్రమించుకొని విదిశానగరము తనకురాజధానిగా చేసికొనెను. అందుచేత నేయాతనికి సేనాధిపతియని పేరుండెను. ఇతఁడు విక్రమార్కశకమునకు పూర్వము నూట యిరువదిరెండు సంవత్సరముల క్రిందట సింహాసనమునకువచ్చెను. ఇతఁడు సింధునది సమీపమున గ్రీకుదేశస్థులతో యుద్ధము చేసి వారిని జయించెను. ఇతఁడు తనవార్థకదశయందు తనకుమారుఁడయిన యగ్నిమిత్రునకు రాజ్యమిచ్చి తానాధ్యాత్మికవిషయమున కాలముగడుపుచుండెను. ఈకాలములో తండ్రికిని కొమారునికిని కొన్నివిషయములందు పడకపోయెను. అగ్నిమిత్రుఁడు ముప్పదియాఱు సంవత్సరములు రాజ్యముచేసి మృతినొందఁగా, అనంతర మాతనికొమారుఁడు వసుమిత్రుఁడు రాజ్యమునకువచ్చి యెనిమిది సంవత్సరములు పాలనముచేసెను.

ఈమాళవికాగ్నిమిత్రము నాకు మూడు ప్రతులు లభించినవి. ఈదేశపుప్రతికిని వంగదేశపు ప్రతికిని బహుస్థలములయందు భేదము కనఁబడుచున్నది. నేను దీనిని తెనిఁగించుటలో విశేషభాగము వంగదేశపుపండితుఁడయిన తారానాథతర్కవాచస్పతిప్రతి ననుసరించినను, అక్కడక్కడ కొన్ని స్థలములయం దీదేశపుపాఠము ననుసరించికొన్ని మార్పులను సహితముచేసినాను. గుణగ్రహణపారీణులు దీనియందలిదోషములను మన్నించి గుణమును గ్రహింతురుగాక!

రాజమహేంద్రవరము,
ది ౧౬ ఏప్రియల్ ౧౮౭౯ సం॥ } కందుకూరి వీరేశలింగము.

ఈనాటకమునందువచ్చు పాత్రములు.

పురుషులు.

అగ్నిమిత్రుఁడు—కథానాయకుఁడైన విదిశానగరపురాజు

వాహతకుఁడు—మంత్రి

గౌతముఁడు—విదూషకుఁడు

హరదత్తుఁడు—నాట్యాచార్యుఁడు; ఇరావతిగురువు

గణదాసుఁడు—నాట్యాచార్యుఁడు; మాళవికగురువు

మౌద్గల్యుఁడు—కంచుకి

వీరసేనుఁడు—ఒకసేనానాయకుఁడు; రాణితమ్ముఁడు

ధ్రువసిద్ధి—విషవైద్యుఁడు

యజ్ఞసేనుఁడు—విదర్భదేశపురాజు

మాధవసేనుఁడు—మాళవికయన్న; విదర్భదేశపురాజు

వసుమిత్రుఁడు—అగ్నిమిత్రుని కొమారుఁడు

పుష్పమిత్రుఁడు—అగ్నిమిత్రునితండ్రి

సుమతి—మాధవసేనునిమంత్రి

సారసకుఁడు—కుబ్జుఁడు

స్త్రీలు.

ధారిణి—అగ్నిమిత్రుని పట్టపుదేవి

ఇరావతి—అగ్నిమిత్రుని భోగభార్య

కౌశిక (పరివ్రాజిక)—సుమతిచెల్లెలు; రాణికి ధర్మకథలు చెప్పునది

మాళవిక—కథానాయకురాలు; మాధవసేనుని చెల్లెలు

బకుళావళిక—మాళవికచెలికత్తె

నిపుణిక—ఇరావతి పనికత్తె

చంద్రిక—ఇరావతిపనికత్తె

జయసేన—అంతఃపురద్వారపాలకురాలు

మధురిక—వనపాలకురాలు

వసులక్ష్మి—రాజకూఁతురు

కౌముదిక—రాణిగారిపనికత్తె

సమాహితిక—పండితకౌశికిపనికత్తె

రజనిక—విదర్భదేశమునుండివచ్చిన పాటకత్తె

మాళవికాగ్నిమిత్రము.

ప్రథమాంకము.

నాంది.

చ. ఎతఁడు మహేశుఁడై ఫలమునిచ్చినతాళికిఁ దోలుదాల్చెఁదా,
నెతఁడు జితేంద్రియుండయి యతీశుఁడగు స్సతి మేనదాల్చియున్,
ఎతఁ డలయష్టమూర్తులను నేలుచు లోకము గర్వకాఁడు తా,
నతఁడు వివేకమిచ్చి హృదయంబులఁ దామసవృత్తిఁ బాచుతన్.

సూత్ర:—అతివిస్తారము పనిలేదు. (తెరవంకఁజూచి) అయ్యా! కొంచెమిటురమ్ము.

పారిపార్శ్వకుఁడు:—(ప్రవేశించి) బావా! ఇదిగో వచ్చినాను.

సూత్ర:—శ్రీకాళిదాస కృతమయిన మాళవికాగ్నిమిత్ర మను పేరుగలనాటకము నీవసంతోత్సవమునం దాడవలసినదని యీసభవారిచే నేనాజ్ఞాపింపబడినాను. కాఁబట్టి సంగీతమారంభింతము.

పారి:—అదికూడదు. సుప్రసిద్ధులయిన ధావక, సౌమిల్ల కవిపుత్రాదులు కల్పించిన నాటకములను మాని వీరు వర్తమానకవియైన కాళిదాసునికృతి నేల బహుమానించుచున్నారు?

సూత్ర:—ఓవివేకీ! నీవుచెప్పినదిసరికాదు. చూడు—

గీ. సర్వమును బ్రాఁతదని యెందు సాదుగాదు
క్రొత్తదనియె కావ్యమునకుఁ గొఱఁతరాదు
యోగ్యులు గ్రహింతురారసి యుత్తమంబు
మూఢుఁడన్యులనే నమ్ము బుద్ధిలేక.

పారి—అందున కీసభవారే ప్రమాణము.

సూత్ర:—అట్లయిన నీవు త్వరపడుము.

గీ. అతులసేవాసమర్థురాలైనయట్టి
యల్ల ధారణి సేవకురాలివలెన
యేను దొలుతను శిరసావహించినట్టి
యీసభికనిదేశాగ మొనర్ప నిచ్చగింతు.

(అని యిద్దఱును బోవుచున్నారు.)

ఇది ప్రస్తావన.

[అప్పుడు వకుళావళిక ప్రవేశించుచున్నది]

వకు:—క్రొత్తగా నేర్చుకొనుచున్న చలికమను నాటకమునందు మాళవిక యెట్లున్నదో నాట్యాచారుడయిన గణదాసు నడిగిరమ్మని ధారణీదేవి నాకాజ్ఞ యిచ్చినది. కాఁబట్టి నేను సంగీతశాలకువెళ్ళెదను (అని నడుచుచున్నది.)

[అంతట ఆభరణమును చేతబట్టుకొని రెండవచేటిక ప్రవేశించుచున్నది]

ప్రథమ:—(రెండవదానిని జూచి) ఓసీ! కౌముదికా! నీకీధైర్యమేమే! నాదగ్గఱనుండియేదాఁటిపోయియు, నన్ను గంటజూడకున్నావు.

ద్వితీయ:—ఓహో! వకుళావళికా! ఇప్పుడే నేను శిల్పివద్దనుండి తీసికొనివచ్చుచున్న దేవిగారి యీసర్పముద్రగల ముద్దుటుంగరమును గుఱించి యాలోచించుచు నీచేతదూషణపడవలసినదాననైతిని.

వకు:—(చూచి) నీదృష్టి తగినదానిమీఁదబడినది! మెఱుఁగులు గ్రక్కుచున్న యీయుంగరముచేత నీహస్తశాఖ పుష్పించినట్లున్నది.

కౌము:—ఓసీ! నీవెక్కడకు వెళ్లుచున్నావు?

వకు:—చెప్పినదానిని మాళవికయెట్లుగ్రహించుచున్నదో యడుగుటకయిదేవిగారియాజ్ఞాప్రకారముగానాట్యాచారుఁడయిన గణదాసుని యొద్దకు వెళ్ళుచున్నాను.

కౌము:—సఖీ! ఆమె యిటువంటి వ్యాపారముచేత దూరస్థురాలు గానున్నను రాజుచేత నెట్లు చూడఁబడినది?

వకు:—అతఁడామెను దేవిగారి పార్శ్వమునందుఁ జిత్తరువులోఁ జూచినవాఁడు.

కౌము:—ఏలాగున?

వకు:—విను. దేవి చిత్రశాలకుఁబోయి, అప్పుడే శిల్పాచార్యుఁడు రంగువేసి తెచ్చిన చిత్రలేఖను జూచుచు నిలుచుండెను. ఇంతలో రాజును వచ్చెను.

కౌము:—అటుతరువాత?

వకు:—ఉపచారమయినతరువాత సింహాసనమునందుఁ గూరుచుండి రాజుగారు చిత్రఫలకమునందు పరిజనమధ్యమున రాణిగారికి సమీపమునను న్న పరిచారికను జూచి దేవిగారినడిగిరి.

కౌము:—ఏమని?

వకు:—దేవికి దగ్గఱగా వ్రాయఁబడిన యపూర్వరాలయిన యీమె పేరేమని.

కౌము:—సుందరరూపముల మీఁద నాదరము కలుగుట యుక్తమే. తరువాత?

వకు:—సదుత్తరము రాక యనాదరము కలుగఁగా రాజుగారనుమానపడి దేవిగారిని గ్రుచ్చిగ్రుచ్చి యడిగిరి. అప్పుడు కొమార్తెయగు వసులక్ష్మి—"అయ్యా! ఈమె మాళవిక"—అని చప్పునఁ జెప్పివేసెను.

కౌము:—(చిఱునవ్వునవ్వి) ఇది బాల్యావస్థకుఁ దగియేయున్నది. తరువాత నేమి జరిగినదో చెప్పు.

వకు:—మరియేమున్నది? ఇప్పుడు మాళవిక రాజుగారి దృష్టిపథమునఁ బడకుండ భద్రముగాఁ గాపాడఁబడుచున్నది.

కౌము:—ఓసీ! ఇఁక నీకు నియమించిన పనిమీఁద నీవు పొమ్ము. నేనును దేవిగారి కీయుంగరమును దీసికొనిపోయెదను.

(అని నిష్క్రమించుచున్నది.)

వకు:—(కొంచము నడచి, చూపు నిగిడించి) ఇదిగో నాట్యాచార్యుఁడు సంగీత శాలనుండి బయలుదేఱివచ్చుచున్నాఁడు. నేనిప్పుడీయన దర్శనము చేసికొనెదను. (అని నడుచుచున్నది.)

గణదాసుఁడు:—(ప్రవేశించి) ఎల్లవారికిని కులవిద్య నిశ్చయముగా నాదరణీయముగానే యుండును. అయినను నాకు నాట్యవిద్యయందున్న గౌరవ మనర్హమయినదికాదు. ఎట్లగును?

చ. ఇది యమరాళికిన్ గనులకింపగు యజ్ఞమయంబు మౌను, లి
య్యది ద్వివిధంబొనర్చె శివుఁ డర్ధసతీసహితాత్మదేహమున్;
దొరదపు రసంబులెల్లఁ ద్రిగుణోద్భవలోక చరిత్రలందిటన్,
వ్పాది దనియించు నాట్యమిల నెల్లరకున్ రుచిభేదచిత్తులన్.

వకు:—అయ్యా! నమస్కారము.

గణ:—సుమంగళీ! దీర్ఘాయుష్యమస్తు!

వకు:—చెప్పినదానిని గ్రహించుటలో శిష్యురాలయిన మాళవిక మీకు విశేషాయాసము కలుగఁజేయుచున్నదేమో దేవిగారు మిమ్మడిగిరమ్మన్నారు.

గణ:—కల్యాణీ! మాళవిక పరమనిపుణురాలనియు మేధావినియనియు దేవిగారికి విన్నవింపుము. వేయిమాటలేటికి?

క. ఏయది భావము తెల్పెడి
యీయభినయవిషయ మామె కేనేర్పెదనో,
యాయది విశేషముగ వడఁ
జేయుచు నాకెకురు నేర్పు చెలువున నుండున్.

వకు:—(తనలో) ప్రతిజ్ఞయం దిరావతిని మించునట్లున్నదే! (ప్రకాశముగా) గురుజను లీవిధముగా సంతోషించుచున్నారు గనుక మీశిష్యురాలిప్పుడు కృతార్థురాలు.

గణ:—ఇటువంటివారులభించుట దుష్కరముగనుక, అడుగుచున్నాను. దేవిగా రీమె నెక్కడనుండి రప్పించినారు?

వసు:—దేవిగారికి తక్కువవర్ణముగాఁడయిన వీరసేనుఁడను పేరుగల తోడఁ బుట్టినవాఁ డొకఁడున్నాఁడు. రాజుగారతనిని నర్మదా తీరమునందు సరిహద్దుననున్న కోటకధికారినిగా నిలిపియున్నారు. అతఁడీచిన్నది ధారణీదేవికి వినోదము కలిగించుట కర్హురాలుగా నుండు నని యెంచి తనయప్పగారికిఁ గానుకగాఁ బంపినవాఁడు.

గణ:—(తనలో) రూపవిశేషమునుఁబట్టి చూడఁగా నాకీమె సత్కులమునందుఁ బుట్టినదిగాఁ దోఁచుచున్నది. (ప్రకాశముగా) కల్యాణీ! నేను నిశ్చయముగాఁ బ్రసిద్ధుఁడ నగుదును.

గీ. నీరదజలంబు పయినుండి వారిరాశి
యందు శుక్తిలోఁబడి ముత్యమైనయట్లు
యువని నుత్తమపాత్రమునందుఁ బడిన
శిక్షకుని విద్యయు గుణవిశేషమొందు.

వసు:—అయ్యా! ఇప్పుడు మీశిష్యురాలెక్కడనున్నది?

గణ:—ఇప్పుడే పంచాంగికాభినయమును నేర్పి యిఁక విశ్రాంతిపొందవలసినదని నేను జెప్పఁగా దిగుడుబావి కెదురుగానున్న గవాక్షములో మంచిగాలిననుభవించుచుఁ గూరుచున్నది.

వసు:—ఇఁక దేవరవారునాకనుజ్ఞ యియ్యవలెను. ఇప్పుడు మీ సంతోషమంతయు నివేదించి దేవిగారికుత్సాహము వృద్ధిపొందించెదను.

గణ:—నీవు మీదేవిదర్శనమునకుబొమ్ము. కొంచెమవకాశము చేసికొని యిప్పుడు నేనును మాయింటికిఁ బోవుచున్నాను.

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు.)

ఇది మిశ్రవిష్కంభము.

[అప్పుడు పరిజనులందఱుననిలువ, వెనుకఁజేరి లేఖ చేతఁబట్టుకొని మంత్రి సేవింప, రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు:—(లేఖ చదువుచున్న మంత్రినిజూచి) వాహతకా! విదర్భరాజు యజ్ఞసేనుఁ డేమితలచుకొన్నాఁడు?

మంత్రి:—దేవా! ఆత్మవినాశము.

రాజు:—ఇప్పుడు సేనాపతియుత్తరమంతయుఁ దెలియఁగోరెదను.

మంత్రి:—ఇప్పుడతఁ డీప్రత్యుత్తరము నిచ్చినవాఁడు—"మాతో సంబంధము చేయనుద్దేశించిన మీపినతండ్రి కొమారుఁడయిన మాధవసేనుఁడు మావద్దకు రావలెనని బయలుదేరి వచ్చుచుండఁగా దారిలో మీయెల్ల పాలించు నధికారి యతనిని ముట్టడిచేసి పట్టుకొనెను. నన్ను విచారించి యాతనిని భార్యాసోదరీసహితముగా విడిచిపెట్టఁదగును" అని తమరు నాకాజ్ఞ యిచ్చుచున్నారు ఇటువంటివిషయములలో సమాన వంశమునందుఁబుట్టినరాజులలో నాచరింపఁబడు వ్యవహారము తమ రెఱుఁగనిదికాదు. కాఁబట్టి యిందులోఁ దమరే మధ్యస్థులుగానుండ నర్హులు. అతని తోడఁబుట్టినపడుచు ముట్టడించినప్పుడుపుట్టిన సంక్షోభములోఁ దప్పిపోయినది. మనుష్యులనుబంపి యామెను వెదకించెదను. మీరవశ్యముగా మాధవసేనుని నాచేత విడిపింపఁగోరినయెడల, విడుపు ధనమును వినుఁడు.

"గీ. మౌర్యమంత్రియైనట్టిమామఱఁదిఁదారు
బంధముననుండి విడిపించి పంతురేని,
వేగమాధవసేనుని విడుచువాఁడ
నిచ్చటఁ జెఱసాలయందుండి యేను నవల."

రాజు:—(రోషముతో) ఎట్టూ! అతఁడు తనతరమెఱుఁగక నాతోఁగార్యపరివర్తనమునకు బేరమాడుచున్నాఁడుగా! వాహాతకా! స్వభావముచేతనే శత్రువయిన యీవైదర్భుఁడు మనకుఁ బ్రతికూలుఁడు గాఁగూడ నగపడుచున్నాఁడు. శత్రుపక్షమువాఁడుగానున్న యీతనిని పూర్వము సంకల్పించుకొన్న ప్రకారముగా నున్మూలనము చేయుట కొఱకు వీరసేనుని వశముననున్న సేచనాశ్రమున కాజ్ఞాపింపుము.

మంత్రి:—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

రాజు:—మరి యీవిషయమున నీయభిప్రాయమేమి?

మంత్రి:—దేవరవారు సెలవిచ్చినది శాస్త్రదృష్టముగానున్నది. ఎట్లన—

గీ. క్రొత్తగా రాజ్యభరముఁ గైకొన్న రిపుఁడు
ప్రజలలో వేరుదిగి దృఢపడఁడు గానఁ
బాఁతుకొనని క్రొత్తగనాటు పాదపంబు
వలెనె యున్మూలనము చేయ సులభుఁడగును.

రాజు:—అట్లయిన రాజ్యతంత్రకారుల వచనము వ్యర్థముకాదు. ఈవచనము ప్రమాణము చేసికొని సేనాపతిని త్వరపెట్టుము.

మంత్రి:—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

[పరిజనులు తమతమవ్యాపారములనుబట్టి రాజుచుట్టును తగినచోట్లనుండఁగా విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ:—"గౌతమా! ఆకస్మికముగాఁ బటమునందుఁజూడఁదటస్థించిన మాళవికను ప్రత్యక్షముగాఁ జూడఁగాంచు నుపాయము నిష్పాడాలోచింపుము" అని మహానుభావులయిన రాజుగారు నాకాజ్ఞాపించియున్నారు. నేనాప్రకారముగాఁ జేసివచ్చినసంగతి యిప్పుడే యాతనికి నివేదించెదను. (అని నడుచుచున్నాఁడు.)

రాజు:—(విదూషకునిజూచి) ఇదిగో! గార్యాంతరమందలి నాయపరమంత్రివచ్చుచున్నాఁడు!

విదూ:—(దగ్గరకుఁబోయి) మీరు వర్ధిల్లుదురుగాక!

రాజు:—(తలయూఁచి) ఇక్కడ గూరుచుండుము.

విదూ:—(కూరుచున్నాఁడు.)

రాజు:—నీప్రజ్ఞానేత్రమున కేదయిన నుపాయము పొడకట్టినదా?

విదూ:—ఇప్పుడు ప్రయోగించిన యుపాయసిద్ధి నడుగుఁడు.

రాజు:—(సంతోషముతో) ఏలాగున?

విదూ:—ఈలాగున. (అని చెవిలో నేకాంతముగాఁ జెప్పుచున్నాఁడు.)

రాజు:—మిత్రుఁడా! మేలుమేలు. నీవు బహునిపుణముగా నారంభించినావు. కార్యసిద్ధి దుర్లభమేయయినను, ఈనీ కార్యారంభమునుబట్టి యిప్పుడయినట్టే సంభావించెదను. ఎట్టన—

గీ. సత్సహాయసంపన్నుఁడె సంఘటింపఁ
గలుగుఁ బ్రతిబంధములుగల్గు కార్యములను
కన్నుగలవాఁడు సహితము గానలేఁడు
వస్తువులఁ జీఁకటిని దీపబలములేక.

(తెరలోపల)—చాలు. ఈపెద్దడంబపుమాటలు చాలు. రాజుగారిసమక్షముననే మనయిద్దఱిలో నెవరధికులో నెవరధములో స్పష్టము కాఁబోవుచున్నది.

రాజు:—(ఆలకించి) మిత్రుఁడా! ఇదిగో నీ నీతివృక్షమప్పుడే పూతఁబట్టినట్టున్నదే?

విదూ:—త్వరలోనే నీవు దానిఫలమునుం జూడఁగలవు.

[అప్పుడు కంచుకి ప్రవేశించుచున్నాఁడు]

కంచు:—దేవా! ప్రభువుగారియాజ్ఞ జరిగించినాఁడనని మంత్రి విజ్ఞాపనముచేయుమన్నాడు. అంతేకాక యభినయాచార్యులయిన హరదత్తగణదాసు లిరువురును బరస్పరజయకాంక్షతోఁ దమదర్శనము నపేక్షించి రూపమునుధరించిన సాక్షాత్కావదేవతలవలెనున్నారు.

రాజు:—వారిని లోపలికిరమ్మను.

కంచు:—దేవర సెలవిచ్చినట్లు చేసెదను. (అని నిష్క్రమించి వారితో మరలఁ బ్రవేశించుచున్నాఁడు.)

కంచు:—ఆచార్యులారా! ఇటు. ఇటు.

గణ:—(రాజునుజూచి)ఓహో! రాజమహిమదురాసదముగదా!

గీ. అపరిచితుఁడుఁగా డితఁ డుగ్రుఁడయినఁ గాఁడు;
భయపడెదనట్టులయ్యుఁ బార్శ్వంబుచేర
జలధివలె నీనృపుఁడు ప్రతిక్షణమునాదు
కన్నులకుఁ గ్రొత్తక్రొత్తగఁ గానిపించు.

హార:—పురుషాకారముననున్న యీజ్యోతి మహాత్తరమయి నదిగదా!

ఉ. ద్వారమున న్నియుక్తపరివారము సమ్మతిమీఁదఁ జొచ్చి, ధా
త్రీరమణాంతికానుచరుఁ డేవ్వని చెంతకుఁ బోవుచుండియున్
మేరకుమీఱి దృష్టి మిఱుమిట్లిటుఁ గొల్పెడి రాజతేజమున్
జేరి మరల్పఁగాఁబడిన చెల్వ వహించితి మాటలేటికిన్.

కం:—ఇదె ప్రభువువారు, మీరు సన్నిధానమునకుఁ బొండు.

ఉభయులు:—(దగ్గరకుఁ బోయి) దేవా! విజయోస్తు!

రాజు:—మీకుస్వాగతము. (పరిజనులనుజూచి) వీరికిఁ బీఠములను బెట్టుఁడు.

[ఇద్దఱును పరిజనులు తెచ్చిన పీఠములమీఁదఁ గూరుచున్నారు.]

రాజు:—ఇదియేమి? శిష్యురాండ్రకు విద్యోపదేశము చేయవలసిన కాలమునందాచార్యులిరువురు నొక్కసారిగా నిక్కడకు విజయముచేసినారు?

గణ:—దేవా! చిత్తగింపుము. నేను సద్గురుముఖమున నభినయ విద్యను జక్కఁగా నభ్యసించినాఁడను. దేవరవారు నాకు నాట్యాభినయాధికారమును దయచేసినారు. దేవిగారును నన్నాదరించుచున్నారు.

రాజు:—ఇదిమాకుఁ దెలియును. అవయినేమి?

గణ:—అట్టి నన్నీహారదత్తుఁడు పెద్దమనుష్యులయెదుట "నీవు నాకాలిధూళితోనయినను సమానుఁడవుగావు" అని యాక్షేపించినాఁడు.

హార:—దేవా! "నాకును నీకును సముద్రమునకును బిల్లకాలువకునుగల తారతమ్యమున్నది" అని యితఁడే నన్ను మొట్టమొదట దూషించినవాఁడు. కాఁబట్టి యిక్కడ దమరే యీయనను నన్నును శాస్త్రమునందును బ్రయోగమునందును బరీక్షసేయుఁడు. దేవరవారే మాయల్పజ్ఞ విశేషజ్ఞ వివాదమును నిర్ణయింపఁదగినవారు.

విదూ:—ఈప్రతిజ్ఞ చక్కఁగా నున్నది.

గణ:—ఈసంకల్పమాత్రమచుయినది. దేవరవారు సావధానముగా వినవలయును.

రాజు:—కొంచము తాళుఁడు. ఇక్కడ బక్షపాతము జరిగినట్లు దేవి యెంచుకొనును. కాఁబట్టి పండితకౌశికీ సహితురాలయిన యామె సమక్షమునందే యీవ్యవహారము తీర్పవలెను.

విదూ:—దేవరవారు సెలవిచ్చినది దివ్యముగానున్నది.

ఆచార్యులు:—దేవరవారిచ్చవచ్చినట్లు చేయవచ్చును.

రాజు:—(కంచుకినిజూచి) మౌద్గల్యా! ఈప్రస్తావన నివేదించి పండితకౌశికీసహితముగా దేవిగారిని బిలుచుకొనిరమ్ము.

కంచు:—దేవరవారియాజ్ఞ చొప్పున జేసెదను.

[అనినిష్క్రమించి సపరివ్రాజికయయిన దేవితో మరలబ్రవేశించుచున్నాఁడు.]

కంచు:—అమ్మా! ఇటు. ఇటు.

ధార:—(పరివ్రాజికనుజూచి) అమ్మా! ఈహరదత్తగణదాసుల కలహవిషయమున మీ కేమితోఁచుచున్నది?

పరివ్రా:—నీపక్షమున కపజయము కలుగునని శంకింపకుము. గణదాసుఁడు ప్రతివాదికిఁ దీసిపోవువాఁడుకాఁడు.

ధార:—అది యట్టిదేయయినను, రాజు చేకొనినవాఁ డగుట చేత హరదత్తున కాధిక్యము హెచ్చును.

పరివ్రా:—అమ్మా! నీవును రాజ్ఞీశబ్దమునకర్హురాలవై యున్నమాట చిత్తమందుంచుకొమ్ము.

గీ. భాస్కరపరిగ్రహముఁజేసి పావకుండు
తాను మహనీయభాసురత్వంబు గన్న,
నలనిశాపరిగ్రహణమువలన శశియు
మహిమఁగాంచఁడె యెల్లెడ మహిని దాను?

విదూ:—చూడు! చూడు! సహచారిణియయిన పండితకౌశికిని ముందుంచుకొని ధారణీదేవి వచ్చుచున్నది.

రాజు:—ఆమెను జూచుచున్నాఁడను.

క. యతివేష మైనకౌశికి
యతులగతిం జేయు మాంగళాలంకృతిఁగా,
సతియాధ్యాత్మికవిద్యా
యుత మైన త్రయీస్వరూపయో యన నలరున్.

పరి:—(దగ్గరకువచ్చి) దేవా! విజయోస్తు'

రాజు:—అమ్మా! నమస్కారము.

పరి:—గీ. వరమహాసార సుప్రసవత్వ మొంది
లలితసమానతమను దాల్చి యలరునట్టి
ధారణీభూతసంతాన ధారిణులకు
వత్సరశతంబు భర్తవై వరలుమీవు.

ధార:—ప్రాణేశ్వరా! మీకు శుభమగుఁగాక!

రాజు:—దేవికిస్వాగతము. (పరివ్రాజికనుజూచి) అమ్మా! పీఠమునుస్వీకరింపుము. (అందఱును గూరుచున్నారు)

రాజు:—అమ్మా! పరస్పరవిజ్ఞానవిషయమున ఘర్షణపడుచున్న యీహరదత్తగణదాసులను మీరిప్పుడు పరీక్షచేయవలెను.

పరి:—(చిఱునవ్వునవ్వి) ఈపరిహాసము చాలును. పట్టణమొద్ద నుండఁగా పల్లెయందా రత్నపరీక్ష?

రాజు:—అట్లుకాదు. నీవు పండితకౌశికివిగదా? నేనును దేవి యుఁగూడ నిందుఁ బక్షపాతులము.

ఆచార్యులు:—దేవరవారు సెలవిచ్చినది బాగుగనున్నది. మధ్యస్థురాలయిన యీమెయే మాగుణదోషనిర్ణయమును చేయుట కర్హురాలు.

రాజు:—అందుచేత నేయీవివాదమీమెయేవిమర్శింపనారంభింపవలెను,

పరి:—దేవా! నాట్యశాస్త్రమునం దాటప్రధానము. కేవల వాగ్వ్యవహారముచేత నేమిప్రయోజనము? ఇందు దేవిగారి యభిప్రాయమేమో!

ధార:—నాయభిప్రాయమడిగితిరా, మొదల వీరిద్దఱివివాదమే నాకు రుచింపకున్నది.

గణ:—దేవీ! విద్యయందు సమానుఁడనని నాకవమానము వచ్చునట్లు చేయుట నీకు ధర్మముకాదు. నన్ననుగ్రహింపవలెను.

విదూ:—అమ్మా! ఈకుక్షింభరుల సంవాదమును విందము. వీరికి జీతములిచ్చి వృథాగాఁగూరుచుండఁబెట్టనేల?

ధార:—నీవు కలహప్రియుఁడవుగానున్నావే.

విదూ:—అమ్మా! అట్లుకాదు. రెండుమదపుటేనుఁగు లన్యోన్యకలహప్రియములయి యున్నప్పుడు వానిలో నేదోయొకటి పరాజయముపొందక శాంతియెట్లుకలుగును?

రాజు:—అమ్మా! మీరుభయులయొక్క నాట్యకౌశలము నీవరకే చూచియున్నవారుకదా?

పరి:—అవును. చూచినదానను.

రాజు:—అట్లయిన వీరిప్పుడంతకంటె నధికముగాఁ దెలుపఁగల దేమున్నది.

పరి:—నేను నదే చెప్పఁదలఁచియున్నాను.

ఉ. కొందరువిద్య నన్యులకుఁ గోవిదులయ్యును నేర్పలేరిలన్;
గొందఱు బోధసేయుదురు గొప్పగఁగొంచెమె తామునేర్చియున్;
బొందుగ రెండిటం దెలివిఁబొంది వెలింగెడు బుద్ధిశాలులే
యెందును నగ్రగణ్యులని యెన్నికఁగాంతురు శిక్షకాళిలోన్.

విదూ:—పూజ్యురాలయిన యీమె వాక్యము విన్నారుకదా? దాని పండితార్థమిది—వీరు నేర్పినది చూచుటవలన నిర్ణయింపవలెనని.

హర:—నాకిది పరమసమ్మతము.

గణ:—దేవా! ఆలాగున జరిగింపవలెను.

దేవి:—మందమతియైన శిష్యురాలు ఉపదేశించినది తిన్నగా గ్రహింపనియెడల అదియు గురువుదోషమేనా?

రాజు:—దేవీ! అవునదియట్టిదే. చెప్పినది తెలుసుకోలేనివానిని స్వీకరించుటలోఁగూడ బుద్ధివైభవము వెల్లడియగును.

దేవి:—(తనలో) ఇప్పుడేమిచేయుదును? (గణదాసునిజూచి ప్రకాశముగా) నాప్రాణేశ్వరుని కుతూహలకరమైన యీమనోరథ పరిపూర్తి యింతటితోఁ జాలును. ఇఁక నిరర్థకప్రయత్నమును మానుఁడు.

విదూ:—దేవిగారు సెలవిచ్చినది బాగున్నది. ఓగణదాసా! సంగీతాచార్యత్వముపొంది సరస్వతికి నైవేద్యముపెట్టు మోదకములను భక్షించుచుఁ గూరుచుండెదు నీకీపరాభవకరమయిన శుష్కకలహము లో నేమి ప్రయోజనమయ్యా?

గణ:—సత్యముగా దేవిగారివాక్యమున కదేయర్థము. సమయోచితమయిన యీవాక్యమును వినుఁడు—

గీ. పడసితినిగొల్వు నేననివాదమునకు
జడిసి యొరుదూషణము నోర్చి చదువునొక్క-
జీవనోపాయముగనె తాఁ జేసికొనెడు
వాఁడు జ్ఞానవిక్రయుఁడగు వణిజుఁ డగును.

దేవి:—శిష్యురాలు మీవద్ద విద్యనారంభించి యెంతోకాలము కాలేదు. తిన్నఁగామనసునఁ బట్టనివిద్య పరీక్షనిచ్చుటయనర్థదాయకము.

గణ:—ఎంతోకాలము కాలేదుగనుకనే నే నింత నిర్బంధపరుచుచున్నాను.

దేవి:—అట్లయిన నిరువురును మీయుపదేశమును బూజ్యురాలైన యీమెకే కనఁబఱుపుఁడు.

పరి:—దేవీ! అదిన్యాయముకాదు. సర్వజ్ఞనకైనను నొంటరిగానుండి న్యాయముతీర్పుట యుక్తముకాదు.

దేవి:—(జనాంతికముగా) ఓ తెలియనిదానా! పరివ్రాజికా! మేలుకొనియున్నను నన్ను నిద్రపోవుచున్నదానివలెఁ జేయుచున్నావు!

(అని యసూయతో రాజునుండి మొగము త్రిప్పుకొనుచున్నది)

రాజు:—(దేవిని బరివ్రాజికకుఁ జూపుచున్నాఁడు)

పరి:—గీ. చంద్రవదనరో! నీవు నిష్కారణముగ
విముఖవయ్యెద వేటికి విభునినుండి?
పతులపయి నెంతవ్రభుతను బడసియున్న
హేతువున్న నె కోపింతు రిలను సతులు.

విదూ:—అమ్మా! హేతువున్నది. స్వపక్షమువారిని రక్షింపవలయును. (గణదాసునివంకఁ జూచి) ఓయీ! అదృష్టశాలివిగనుక దేవిగారి కోపవ్యాజముచేత నీవిప్పుడు బ్రతికిపోయినావు. తామెంత మంచి శిక్షపొందినవారయినను పరునిచేఁ జూపవలసివచ్చినప్పుడు దండకులు జంకుపడుదురు.

గణ:—దేవీ! వినుము. ఈవిధముగా నితఁ డెంచుకొనుచున్నాఁడు. అందుచేతనిప్పుడు—

గీ. నేను జెప్పినవిద్యను గానిపింపఁ
దలఁచి యున్నాఁడ నీవివాదంబునందు
నందు కీవనుమతి యియ్యకుందువేని,
విడువఁబడినాఁడ నీచేత వెలఁది నేఁడు.

(అని పీఠము నుండి లేవఁబోవుచున్నాఁడు.)

దేవి:—(తనలో) ఇఁక నేమిగతి? (ప్రకాశముగా) గురువులే శిష్యజనులయెడ సర్వాధికారులు.

గణ:—దీర్ఘాయుష్మంతురాలవుకమ్ము ఇది వ్యాజమన్న శంక యింతటితోఁ జాలును. (రాజునుజూచి) దేవిగారనుజ్ఞయిచ్చినారు. కాబట్టి యే యభినయరూపమునందు విద్య కనఁబఱుపవలయునో దేవర యాజ్ఞాపించవలెను.

రాజు:—ఈమె సెలవిచ్చినదానియందు.

పరి:—దేవిగారి మనసులో నేమోయున్నది. అందుచేత నేను శంకించుచున్నాను.

దేవి:—శంకవదలి పలుకవచ్చును. నా పరిజనముమీఁదను ప్రభువుగారికధికారమున్నది.

రాజు:—నాకని చెప్పు.

దేవి:—అమ్మా! ఇప్పుడు చెప్పు.

పరి:—దేవా! శర్మిష్ఠచేత రచియింపఁబడి పాదచతుష్టయ సహితమయిన చలికమును నాటక మభినయించుట కిష్టమని చెప్పుచున్నారు. ఆయొక్కదానినె యిద్దఱిచేతను పట్టించిచూతము. దానివలననే వీరి యుపదేశ తారతమ్యమును దెలిసికొనవచ్చును.

ఆచార్యులు:—అమ్మగారాజ్ఞాపించినట్లు చేయుఁడు.

విదూ:—అట్లయిన మీరిరువురును నాటకశాలయందు సంగీత రచనచేసి రాజుగారియొద్దకు దూతనంపుఁడు. అట్లుకానియెడల, మద్దెల చప్పుడే మమ్ము లేవఁదీసికొనివచ్చును.

హర:—ఆలాగే. (అని లేచుచున్నాఁడు.)

గణ:—(ధారిణివంకఁ జూచుచున్నాఁడు.)

దేవి:—(గణదాసునిజూచి) అయ్యా! మీకు విజయముకలుగునుగాక! నేనెప్పుడును మీకు మేలుగోరుదాననేసుమా!

(ఆచార్యులు లేచుచున్నారు.)

పరి:—కొంచెమిటురండు.

ఆచా:—(దగ్గఱకుఁబోయి) ఇదిగో వచ్చినారము.

పరి:—తారతమ్యనిర్ణయాధికారము పొందితిగనుకఁ జెప్పుచున్నాను. అన్నియవయవములసౌష్టవమును చక్కఁగాఁ గనఁబడుటకయి యలంకారము విశేషముగాఁజేయక పాత్రలను దీసికొనిరండు.

ఇద్దఱు:—ఈసంగతి తమరు మాకు బోధింపనక్కఱలేదు.

(అని నిష్క్రమించుచున్నారు.)

దేవి:—(రాజునుజూచి) ఇటువంటినేర్పు తమరు రాజకార్యముల యందుఁ బ్రయోగించినయెడల, ఎంతో మేలు కలుగును.

రాజు:—నన్నన్యథా భావింపకుము. ఓమనోనాయికా! ఇది నేనువన్నినదికాదుగదా? సమానవిద్యగలవారు కీర్తికొఱకొకరినొకరు తప్పులుపట్టుకొనుట సాధారణమే.

[నేపథ్యమునందు మృదంగధ్వని వినఁబడఁగా నందఱు నాలకించుచున్నారు]

పరి:—ఆహా! సంగీతమారంభమయినది

గీ. మేఘగర్జనశంఖచే మెడలనెత్తి
మద్దెలరవంబుతోడ నెమళ్ళుకూయ
మధురముగ బర్హిణాంగనల్ మలసిచేయు
మధ్యమస్వర మలరించె మదులనిపుడు.

రాజు:—దేవీ! మనమక్కడ సభికులమగుదము రమ్ము.

దేవి:—(తనలో) ఆహా! ఏమి ప్రాణనాయకుని యవినయము!

(అందఱును లేచుచున్నారు.)

విదూ:—(రహస్యముగా) ఓయీ! ధీరత్వముతో నడువుము. ధారణీదేవి మఱియొకవిధముగా భావించుకొనును.

రాజు:—

గీ. ధైర్యమువహించియున్నను దగఁగ నన్నుఁ
గరముఁ ద్వరపెట్టుచున్న దీమురజరవము
సిద్ధిపథమున నడుచుచుఁ జెలఁగునట్టి
స్వసుమనోరథశబ్దంబు చందమునను.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము.

రంగము—సంగీతశాల.

[అప్పుడు పీఠముమీఁదగూరుచుండి మిత్రునితోఁగూడ రాజును, ధారణియు, పరివ్రాజికయు, అర్హపరివారమును ప్రవేశించుచున్నారు.]

రాజు:—అహ్మా! పూజ్యులయిన యాచార్యు లిరువురిలో నెవ్వరి యుపదేశనైపుణ్యమును ముందుగాఁ జూతము?

పరి:—పాండిత్యప్రభావముచేత నిద్దఱును సమానులేయయినను వయోవృద్ధుఁడగుటవలన గణదాసునే ముందుగా గౌరవింపఁదగును.

రాజు:—అట్లయిన, మౌద్గల్యా! ఆపూజ్యుల కీసంగతి తెలిపి, నీవు నీపనిమీఁదఁబొమ్ము.

కంచు:—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని పోవుచున్నాఁడు.)

గణ:—(ప్రవేశించి) దేవా! మధ్యలయగలిగి శర్మిష్ఠచేతఁజేయఁబడిన చలితనాటకములో నాలుగుపాదములుగల కృతియొకటికలదు. దేవరవారు దానిప్రయోగ మేకాగ్రచిత్తముతోఁ జిత్తగింపఁదగును.

రాజు:—ఆచార్యా! మేముమిక్కిలియవహితులమైయున్నాము. పాత్రములను దీసికొనిరమ్ము. (గణదాసుఁడు నిష్క్రమించుచున్నాఁడు)

రాజు:—(జనాంతికముగా) మిత్రుఁడా!

గీ. అలయలంకారమందిరమందు నున్న
కన్నదర్శింపఁగోరి నాకన్నుదోయి
క్షణముఁగాలవిలంబము సైఁపలేక
తెరనుదీయుటంగ నుంకించుకరణి నుండె.

విదూ:—(రహస్యముగా) నీయభీప్సితమూర్తి విశేషము దృష్టిపథమునఁబడఁబోవుచున్నది. కనుక నీవిప్పుడప్రమత్తుఁడవయి చూడుము.

[అప్పుడు తనయంగసౌష్ఠవమును జూచుచున్న యాచార్యునితో
మాళవిక ప్రవేశించుచున్నది.]

విదూ:—దేవా! చూడుము. పరాధీనురాలయియున్నను, ఆమె సౌందర్యమునకుఁ గొఱంతయేమియు లేకయున్నదిగదా?

రాజు:—(రహస్యముగా) మిత్రుఁడా!

గీ. చిత్రపటమున నామెఁ వీక్షించినప్పు
డట్టి సొగసుండదని సంశయంబువొడమె
నేఁడు ప్రత్యక్షముగ నీమెఁజూడ నింపు
శిల్పి యప్రౌఢుఁడంచుఁ దోఁచెడిని మదికి.

గణ:—బిడ్డా! స్వస్థచిత్తురాలవుకమ్ము.

రాజు:—(తనలో) ఓహో! ఈరూపము సర్వావస్థలయందును నిర్దోషముగా నున్నది.

సీ. నిడువాలుఁగన్నులఁ గడునొప్పివదనంబు
శరదిందుకాంతిని జానుమీఱు
అంసభాగంబుల నందంబుగావంగి
బాహువులెంతయు బాగుమీఱు
ఘనమైననిక్కుఁ జన్గవచేతవక్షంబు
పార్శ్వమందడఁగిన భాతిమీఱు
మధ్యప్రదేశంబు మానుగఁ బిడికిటఁ
బట్టంగఁదగియుండి వన్నెమీఱు
జఘనమెంతయు నమితమై సాటిమీఱు
వంపులై యొప్పునంగుళు ల్పాదములను
హృదయమున నర్తనాచార్యుఁ డెట్టులుండె
నఖిలమించునో యట్లుండె నంగగరిమ.

మాళ:—(ఉపగానముచేసి, చతుష్పాదగీతమును బాడుచున్నది.)

* చ. హృదయమ! దుర్లభుండు ప్రియుఁడీయన పైనిఁక నాశమానుమీ;
యదరెడు వామనేత్రి మహాహా యిపుడేమొకో నాకువింతగా;
నొదవెడు నెట్లుక్రమ్మఱనయో చిరదర్శితు నీయనంగనా?
సదయతఁ బ్రేమచేఁ బరవశాత్మగ నన్ను నెఱుంగు నాయకా!

(అని రసోచితముగా నభినయించుచున్నది.)

విదూ:—(రహస్యముగా) ఓహో! మిత్రుఁడా! ఈమె ఈనాలవ పదార్థమునభినయించు మిషపెట్టి తన్ను నీకర్పించుచున్నట్లుగా నున్నది!

రాజు:—సఖుఁడా! మాయిరువురహృదయములు నట్లేయున్నవి.

చ. ఆయమ 'ప్రేమచే వివశురాలనుగా నిదె నన్నెఱుంగుమో
నాయకా' యన్న వాక్యమును నాకడ సాభినయంబుగాఁగఁ దా
నీమెడఁ బాడుచో సరస నీవల ధారణియుంట నొక్కలేఁ
బ్రియమువాని వేఁడుమిషఁ బ్రార్థనచేసెను నన్నుకూరిమిన్.

[మాళవిక గీతముపాడినతరువాత వెనుకకుఁ బోఁబోవుచున్నది.]

విదూ:—అమ్మా! పోకనిలువుము. నీ పాటయందొకక్రమము మఱచిపోతివి? నేను దానినప్పుడే నీకుఁ దెలిపెదను.

గణ:—బిడ్డా! నేనుపదేశించిన విద్యయందు లోపముండదని కనఁబఱుతువుగాని క్షణమాత్రము నిలువుము.

(మాళవిక జంకి నిలుచున్నది.)

---

* ఘంటారాగం—ఆదితాళం.

పల్లవి:—ఏలవలచితి నయ్యయో! యేలాగుదరియింతునయ్యయో!
అనుపల్లవి:—ఈలాగౌట తెలియనైతి ♦ నిలవయి వెతలపాలయితి.
౧. మనస! నీవుకోరునట్టి ♦ మనుజుఁడెంతో దుర్లభుఁడు సుమ్మా.
గనుక, నీవు నామీఁది ♦ కట్టాసమానుము నేఁడు ... ఏలవలచితి.
౨. ఎడమకన్ను దేమోకాని ♦ యిప్పుడెంతో తనయంత,
వడిగనదరఁజొచ్చెనిదిగో ♦ బాగయ్యేమేలుమేలహాహా ... ఏలవలచితి
3 ఇన్నినాళ్లకిట్లు నాకు ♦ నిటుల లభించిన నరనాథుఁ
గన్నులారఁజూడనెట్లు ♦ క్రమ్మఱంగాఁగలుగును? ... ఏలవలచితి
౪. అవురనీవెఱింగికొమ్మ ♦ యల నీవయిప్రేమచే
వివశురాలనంచు నన్ను ♦ వేవేగసద్దయ పూని ... ఏలవలచితి

రాజు:—(తనలో) ఆహా! ఈమెరూపము సర్వావస్థలయందును వింతసోయగమును నింపుచున్నది. ఎట్లన

మ. వలయంబుల్ మణిబంధమంటఁ గటినొప్పంజేర్చి డాకేలు, ని
శ్చలతన్ రెండవకేలువాల్చి దిగువన్ శ్యామాలతంబోలఁగా,
నలరన్ మీటుచు నేలచూపులను పాదాంగుష్ఠమాత్రంబునన్
నిలుచున్నట్టిదె నృత్యకాలమునకంటెన్ జెల్వు చెల్వొందెడున్.

దేవి:—ఈయాచార్యులు గౌతమునిమాటను సహితము పాటిగాఁ బట్టుచున్నారుగదా?

గణ:—దేవీ! అట్లనంగూడదు. రాజవిశ్వాసమువలన గౌతమునికి సూక్ష్మదర్శిత్వము కలుగుచున్నది. చూడుము—

గీ. చిల్లగింజల పొడితోడఁ జేరకతనఁ
గలుషజలంబు స్వచ్ఛతఁ గాంచునట్లు
పండితులతోడి సహవాసబలముచేత
మందుఁడైనను గడుబుద్ధిమంతుఁడగును.

(విదూషకునిజూచి) మీయభిప్రాయమును వినఁగోరుచున్నాము.

విదూ:—(గణదాసునిజూచి) ముందుగాఁ బండితకౌశికి నడుగుఁడు. నేను గనిపెట్టిన క్రమభంగమును తరువాతఁ జెప్పెదను.

గణ:—అమ్మా! గుణముగాని దోషమునుగాని నీవు కనిపెట్టినది సెలవిమ్ము.

పరి:—నేను జూచినంతవఱకు సర్వమును నిర్దుష్టముగానున్నది. ఎందుచేతనన—

చ. పలుకులయర్థమంగముల బాగుగఁ గన్పఱుపంబడెన్; రసం
బుల లయతోడ నైక్యమునుబొందెఁ బదంబులుపెట్టురీతి; యిం
పలరెను గొంచెమై మృదుకరాభినయంబు పరానువృత్తులన్;
వెలసె మనోహరంబగుచు వింతగ భావము రాగబద్ధమై.

గణ:—దేవరవారెట్లు భావించుచున్నారు?

రాజు:—మీకు స్వపక్షమువారియెడఁగల యభిమానము తగ్గిపోయినది?

గణ:—నేనిప్పుడు నర్తనాచార్యుఁడ నయినాను.

గీ. జగతి నిష్పక్షపాతులౌ సాధుజనులె
శిక్షకునివిద్యశుద్ధత చెప్పగలరు;
వహ్నియందును బంగారువలెనె మీదు
సన్నిధిని వన్నెకెక్కు మాచదువుకూడ.

దేవి:—అయ్యా! మీరదృష్టవంతులు. ఈపరీక్షకులచేత మెప్పుపొందినారు.

గణ:—దేవీ! మీపరిగ్రహమే నావృద్ధికి హేతువు. (విదూషకునిఁజూచి) గౌతమా! నీమనస్సులోనున్నదేమో యిప్పుడు చెప్పుము.

విదూ:—ప్రథమోపదేశదర్శన సమయమునందు ముందుగా బ్రాహ్మణపూజచేయవలెను. మీరాపూజను మరచిపోయినారు.

పరి:—ఓహో! ఇది ప్రయోగములోపలి ప్రశ్నగదా!

[అందఱును నవ్వుచున్నారు. మాళవికయుఁ జిఱునవ్వునవ్వుచున్నది.]

రాజు:—(తనలో) కన్నులు గలిగినందునకుఁ జూడవలసిన సారమును జూడఁగాంచితిని! ఎట్లన—

గీ. పల్వరుసయింత కానఁగఁబడఁగ మంద
హాస మొనరించు నీవిశాలాక్షిమోము
కేసరంబులొక్కింత లక్షింపనయిన
కమలమునుబోలి యందమై కానిపించు.

గణ:—ఓదొడ్డబ్రాహ్మణుఁడా! ఇదిపరీక్షకాని యాటకాదుగదా? ఆటయేయయిన పక్షమునఁ బూజార్హుఁడవయిననిన్నుఁ బూజింపకుందుమా?

విదూ:—నేను నిశ్చయముగా నీరుత్రాగవలెనన్న యాశతో వట్టియుఱుములుగల యాకాశమును గనిపెట్టుకొనియున్న చాతకపక్షినయినాను.

పరి:—అలాగుననే యయినావు.

విదూ:—అట్లయినఁ బండితులసంతోషమువలన లాభము పొందవలె నని నమ్మియున్న నావంటివారు కేవలమూఢులు. పూజ్యురాలయిన యీపరివ్రాజిక మెచ్చినది. కనుక నేనీయునకు బహుమాన మిచ్చెదను. (అని రాజుచేతినుండి బంగరుమురుగును దీయుచున్నాఁడు.)

దేవి:—నిలువుము. రెండవవారి గుణతారతమ్యముకూడఁ దెలియకమునుపే నీవీయాభరణ మేలయిచ్చెదవు?

విదూ:—ఇది మఱియొకరిసొత్తుగనుక.

దేవి:—(ఆచార్యునివంకఁజూచి) అయ్యా! గణదాసా! మీ శిష్యురాలు విద్యకనఁబఱుచుటయయినదిగదా?

గణ:—బిడ్డా! మనమిఁక వెళ్లుదుము రా. ఆచార్యునితోఁగూడ మాళవిక పోవుచున్నది.

విదూ:—(రహస్యముగా) దేవరసేవచేయుటలో నాబుద్ధివైభవ మింతే.

రాజు:—'ఇంతే' యన్నమాటచాలింపు.

గీ. ఆమె తెఱజాటునను మఱుఁగగుట నాదు
కనులకును భాగ్య మస్తమించినవిధంబు
హృదయమున కుత్సవసమాప్తి యొదవినట్లు
హర్షమునకు ద్వారము మూసినట్లుఁదోఁచు.

విదూ:—(రహస్యముగా) మేలు! దరిద్రాతురునివలె వైద్యుని నే యౌషధము చేసి పెట్టుమనుచున్నావు!

[హరదత్తుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

హర:—దేవా! ఇప్పుడు నాయొక్క విద్యోపదేశమును జిత్తగించుట కనుగ్రహింపుఁడు.

రాజు:—(తనలో) నేనుజూడఁగోరినది సమాప్తమయినది. దాక్షిణ్యముకనఁబఱుచుచుఁ (ప్రకాశముగా) మేముచూడ వేడుకగల వారమయియే యున్నాము.

హర:—నేను ధన్యుఁడనయినాను.

[తెఱలో వైతాళికుఁడు.]

దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక ! మధ్యాహ్నమగుచున్నది. అందుచేతనే—

ఉ. అంచలు కన్నుమూసెడును నంబుజపత్రమునీడ డిగ్గియున్,
మించినవేఁడి, జేరవలె మేడలచూరులు పావురంబులుఁన్,
కాంచినెమళ్ళుపోయెడు దగన్ జలయంత్రముచేర నీటికై,
మించెఁ బ్రతాపపూర్ణుఁడయి మీవలెనే రవియున్న ప్రాలకా.

విదూ:—అయ్యో! అయ్యో! మాకు భోజనవేళయయినది. వేళతప్పినయెడలఁ బ్రభువువారికి జబ్బుచేయునని వైద్యులు చెప్పుచున్నారు. హరదత్తా! నీవేమిచెప్పెదవు?

హర:—ఇప్పుడు నాకేమి చెప్పుటకును నవకాశములేదు.

రాజు:—(హరదత్తునివంకఁజూచి) అట్లయిన మీయుపదేశమును రేపుచూడవచ్చును. ఇప్పటికిఁ జాలింపుఁడు.

హర:—దేవరవారాజ్ఞయిచ్చినట్లు చేసెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

దేవి:—దేవరవారు మాధ్యాహ్నికకృత్యములను దీర్పవలెను.

విదూ:—దేవీ! అన్నపానములు నేఁడు త్వరపెట్టి విశేషముగాఁ జేయింపుము.

పరి:— (లేచి) మీకు శుభమగుఁగాక! (అని దేవితోఁగూడ పోవుచున్నది.)

విదూ:—ఓహో! కేవలరూపమునందేకాక నాట్యమునందుఁ గూడ మాళవికయసమానురాలుగానున్నదే.

రాజు:—మిత్రుఁడా!

గీ. విద్యచేతను సౌందర్యవిభవమునను
ధాత యిట్టియవ్యాజసుందరిని జేసి
విషముపూసినబాణంబు వేఱొకండు
పంచబాణు కిప్పుడు కల్పించెఁదాను.

పలుకలుకులేల? నేను నీ వారయవలసినవాఁడ నయినాను.

విదూ:—నేనును నీకారయవలసినవాఁడ నయినాను. అంగడిలోని మంగలమువలెనిశ్చయముగా నాకడుపు మండుకొనిపోవుచున్నది.

రాజు:—అందుకు సందేహము లేదు. నీవుమిత్రకార్యమునందుఁ ద్వరపడవలెను.

విదూ:—నేను గృతనిశ్చయుఁడ నయినాను. కాని, మేఘములచాటునున్న వెన్నెలవలెనే పరాధీనురాలయిన మాళవికదర్శనమే శీఘ్రసాధ్యము కాదు. నీవో, కటికివానిసమీపమునన్న మాంసమునందత్యాశకలిగి చేర భయపడుచున్న గృధ్రమువలెనున్నావు అత్యాతురునివలెఁ గార్యసిద్ధిని వేఁడుచున్న నిన్నుఁ జూడగా నాకు వేడుకగుచున్నది.

రాజు:—నేనాతురుడను గాక యెట్లుండగలను?

క. అంతఃపురమునఁ గలిగిన
యింతులవ్యాపారములకు నెద విముఖంబై
యెంతయు నీసుందరిపయి
నంతతసుస్నేహమునకు స్థానంబయ్యెన్.

(అని యందఱును నిష్క్రమించుచున్నారు.)

తృ తీ యాం క ము.

[అప్పుడు పరివ్రాజికయొక్క పరిచారికయైన సమాహితిక ప్రవేశించుచున్నది.]

సమా:—“సమాహితికా! నీవుపోయి రాజుగారి తోఁటలో నిమ్మపండొకటి తీసికొనిరమ్ము”అని పూజ్యురాలయిన పరివ్రాజిక నాకాజ్ఞాపించినది. అందుచేత నే నుద్యానవనపాలకురాలయిన మధురికను వెదకఁ బోయెదను. (కొంచెమునడచిచూచి) అదిగో కాంచనాశోక

మును చూచుచు మధురిక నిలుచున్నది. దానివద్దకుఁబోయి కుశల వార్త యడిగెదను.

[అప్పు డుద్యాన పాలకురాలయిన మధురిక ప్రవేశించుచున్నది]

సమా:—(సమీపించి) సఖీ! ఉద్యానవన వ్యాపారమునందు నీవు సుఖముగా నున్నావా?

మధు:—ఓహోహో! సమాహితికవా? సఖీ! నీకు స్వాగతము.

సమా:—ఓసీ! "నావంటివారు రాజుగారిని రిక్తహస్తములతోఁ బోయి చూడఁ గూడదు గనుక. దర్శనముచేయఁగోరు నాకొక నిమ్మపండుకావలసియున్నది." అని పూజ్యురాలయిన పరివ్రాజిక నీకాన తిచ్చుచున్నది.

మధు:—ఇదిగో నిమ్మపండు సమీపముననే యున్నది కాని, పరస్పర వివాదము లాడుచున్న నాట్యాచారుల యుపదేశమునుజూచి, ఆపూజ్యురా లెవరిని మెచ్చినదో చెప్పు.

సమా:—ఇద్దఱును పాండిత్యమును ప్రయోగనైపుణ్యమును గలవారే. అయినను శిష్యురాలిగుణవిశేషముచేత గుణదాసుఁడే యధికుఁడని చెప్పఁబడినాఁడు.

మధు:—అటుతరువాత మాళవికవిషయమయిన రహస్యవ్యాపారమును నీవేమయిన విన్నావా?

సమా:—రాజామెయందు గాఢానురాగము కలవాఁడైయున్నాఁడు. కాని కేవలము ధారణీదేవియొక్క మనసునొప్పించుటకిష్టములేక తన ప్రభుత్వమును గనఁబఱుపకున్నాఁడు. ఈదినములయందు వాడిపోయిన మాలతీమాలవలెనే మాళవికయు శోషిల్లి కనఁబడుచున్నది. అంతకంటె నాఁకు దెలియదు. నన్నువిడిచిపెట్టుము.

మధు:—ఈకొమ్మయందు వ్రేలుచున్ననిమ్మపండుతీసికొనిపొమ్ము.

సమా:—(కోసికొన్నట్టభినయించుచు) సఖీ! ఈసాధుజన శుశ్రూషచేత నీవింతకంటెను మంచిఫలమును బొందుము.

(అని బయలుదేఱుచున్నది.)

మధు:—సఖీ! మనము కలసిపోవుదము. నేనుగూడవచ్చి చిరకాలమునుండి పూఁతపట్టకున్న యీకాంచనాశోకవృక్షమునకు దోహదము చేయించు నిమిత్తమయి దేవిగారితో మనవిచేసెదను.

సమా:—అవును. అదినీపనియేకదా?

(అని యిద్దఱును బోవుచున్నారు)

ఇది ప్రవేశకము.

[అప్పుడు కామావస్థలోనున్న రాజును విదూషకుడును బ్రవేశించుచున్నారు.]

రాజు:—(తన్నుఁజూచుకొని)

ఉ. కాయముచిక్కెఁ జెల్వు నలకామిని కౌఁగిలిసౌఖ్యమబ్బమిన్;
బాయక కన్ను నీరువిడువంగనగున్ క్షణమేని చూడమిన్;
దోయజనేత్రి నించుకయుఁ ద్రోచితొలంగనియట్టిసివ్వ న
త్యాయతతాపమొందెదవహా యిది యేమిటికిందు? డెందమా?

విదూ:—మీరుధైర్యమువిడిచి దుఃఖించుట యింతటితోఁ జాలును; నేనుమాళవికకుఁ బ్రియసఖియైన వకుళావళికనుజూచి దేవరవారి సందేశమును జెప్పివచ్చినాను.

రాజు:—అప్పుడది యేమన్నది?

విదూ:—"ఈయాజ్ఞచేత నేనుకృతార్థురాలనయినాను. అయినను భాగ్యహీనురాలయిన యీమెనిప్పుడు నిధినిరక్షించునట్లుగా దేవిగారు మరింత కుడిలముగాఁ గావలియుంచి కాపాడుచున్నారుగనుక, ఆమెవద్దకుఁబోవుటయే సుఖసాధ్యము కాకున్నది. అట్లయ్యును నేను బ్రయత్నముజేసెదనని రాజుగారితో విన్నవింపుము." అన్నది.

రాజు:—ఓదేవా! ఓసంకల్పసంభవా! ప్రతిబంధములతో నిండిన విషయములయందుఁ బ్రవేశపెట్టి నన్ను క్షణకాలమైన సహింప శక్యముకానట్లుగాఁ గొట్టుచున్నావు. (విస్మయముతో)

గీ. పరమకోమలమగు నీదు బాణమేడ?
హృదయభేదకమగుఁ పీడయేడ? మదన!

మృదువుఁ దీక్ష్ణంబు వగునన్న మేటివింత
వసుధ నీయందుఁ గానంగఁబడెడు నేఁడు.

విదూ:—ఈకార్యసాధన విషయమై నేనొక యుపాయప్రయోగము చేసినానని దేవరకు విన్నవించుచున్నాను. కనుక నీమనస్సు దృఢముగానుంచుకొమ్ము.

రాజు:—ఓయీ! ఉచితవ్యాపారములయందు విముఖమయి యున్న యీహృదయముతో నేనీదిన శేష మెట్లు డఁగడపుదును?

విదూ:—క్రొత్తగాఁబూచినమనోహరము లయిన రక్తకురువక పుష్పములను గానుకగాఁబంపి, ఈయభినవవసంత సమయమునందు దేవరవారితోఁగూడ డోలాధిరోహణసుఖ మనుభవింప మనసుపడుచున్నానని యిరావతి యిప్పుడే నిపుణికచేతఁ దమకు సమాచారము పంపినదిగదా? దేవరవారును అంగీకరించియున్నారు గనుక మనము ప్రమదవనమునకే పోదము.

రాజు:—అది సరిపడదు.

విదూ:—ఎందుచేత?

రాజు:—మిత్రుఁడా! స్త్రీలు సహజముగా బుద్ధికౌశలముకలవారు. నేను బయి కెంతలాలనము చేయుచున్నను నామనస్సు మఱియొకతెయందుఁ దగిలియున్నసంగతి నీసఖ యెట్లు కనిపెట్టకుండును?

ఉ. నెయ్యము క్రొత్తది హేతువు లనేకము కూర్పఁగవచ్చుఁగాన, నే
నియ్యెడ మానుటహాఁమగు నిప్పుడిరావతిమీఁది కూరిమిన్;
నెయ్యము లేనిచోఁ హృదిని, నేర్పునఁ బూర్వముకంటె హెచ్చుగాఁ
జయ్యనఁజేయుసేవ యుపచారముకాదు వివేకురాండ్రకున్.

విదూ:—దేవరయంతఃపురకాంతలమీఁది దాక్షిణ్యము నొక్కసారిగా వెనుకపట్టించుట తగదు.

రాజు:—(ఆలోచించి) అట్లయినచోఁ బ్రమదవనమార్గము కనఁబఱుపుము.

విదూ:—దేవా! ఇదే యిదె. (ఇద్దఱును నడుచుచున్నారు)

విదూ:—ఈప్రమదవనము వాయుబలముచేతఁ గదలుచున్న చిగురుటాకులను వ్రేళ్ళతో దేవరవారిని బ్రవేశింపఁ ద్వరపెట్టుచున్న ట్లున్నది.

రాజు:—(స్పర్శసుఖము కనఁబఱిచి) వసంతము వచ్చినదికదా? మిత్రుఁడా! చూడుము.

చ. కదిసినగండుఁగోయిలలకర్ణసుఖావహకూజితంబుచే
సదయతఁ గాముబాధ కెటు సైపుదునం చనునట్లు లోప్పుడున్;
కుదిగ వసంతుఁ డామ్రసుమవాసనలం దగుచల్లగాలిచే
మృదువగు చేతితో నిమురురీతిని తోఁచెడు మచ్ఛరీరముల్.

విదూ:—తాపోపశమనముఁ గలుగుటకయి యిందు బ్రవేశింపుము.
(ఇద్దఱును బ్రవేసించుచున్నారు.)

విదూ:—అవధానముతోఁ జూడుము. ఇదిగో ప్రమదవనలక్ష్మి నిన్నాకర్షించుటకో యనునట్లు యువతీవేషమును లజ్జపరుచు పుష్పాలంకారము ధరించియున్నది.

రాజు:—నేనును విస్మయముతోనే చూచుచున్నాను.

సీ. బింబాధరాలక్తకంబును మించెడు
నసమరక్తాశోక కుసుమవితతి
మకరికాపత్రాదిమండనంబును మించు
నరుణసుభ్రవినీల కురువకాళి
చంచరీక సమాశ్రయాంచిత తిలపుష్పగరిమ
మించును దిలకంబుఁగూడ
బహువిధశృంగారభావంబులను మించి
వింతగానున్న వసంతలక్ష్మి
పౌఢయువతీజనంబుల రమ్యమైన
మోహములనుజేయు సింగారములను మించి

వానికి నవజ్ఞ చేసెదువరుస నిదిగో
వణుకుచున్నది నేత్రోత్సవంబుగాఁగ.

(అని యుద్యానశోభను నిరూపించుచున్నారు.)

[అప్పుడు సంభ్రమముతో మాళవిక ప్రవేశించుచున్నది]

మాళ:—రాజుమనసు తెలియక నే నాయనను గామించుచున్నందుకు లజ్జపడుచున్నాను. నేనీవృత్తాంతమును నాప్రియసఖి కెట్లు చెప్పఁగలను? మన్మథుఁడు నాకీయప్రతీకారమైన తీవ్రవేదన యెంతకాలము పెట్టునో తెలియఁజాలకున్నాను. (కొన్ని యడుగులు నడిచి) నే నెక్కడకు బయలుదేఱినాను? (ఆలోచించి) "గౌతముని చపలత్వముచేత నుయ్యాలనుండిపడి నాకాలునొప్పిపట్టియున్నది, అందుచేత నేనుబోవుట కశక్తురాలనుగా నున్నాను. కాఁబట్టి నీవుపోయి కాంచనాశోకమునకు దోహదము నిర్వర్తింపుము. అది యయిదు రాత్రిలలోపలఁ బూతఁబట్టినపక్షమున, నీమనోరథపూర్వకమయిన యనుగ్రహమును నీకుఁ జేసెదను." అని దేవిగారు నన్నుఁబంపి యున్నారు. నేనిప్పుడు నియమించినస్థలమునకువచ్చి యున్నాను. నాపాదాలంకారమును బట్టుకొని నావెంటనే బయలుదేఱిన వకుళావళిక యింకనురాకున్నది. నేనీలోపల ముహూర్తకాల మొంటిగా దుఃఖపడియెదను. (అని యిటునటు తిరుగుచున్నది.)

విదూ:—(చూచి) ఆహాహా! ఇదిగో మద్యపానవిహ్వలుఁడై యున్నవానియొద్దకుఁ బానకపుఁగుండ తీసికొనిరాఁబడినది!

రాజు:—ఓయీ! అదియేమి?

విదూ:—అదిగో మాళవిక విశేషాభరణములు లేక ముఖమునందు విచారముకన్పడ నొంటిగానమీపమునందే నిలిచియున్నది.

రాజు:—(సంతోషముతో) ఏమీ! మాళవికా?

విదూ:—నిస్సందేహముగా.

రాజు:—ఇప్పుడు నాకుఁబ్రాణములు నిలుపుకొనుటకు శక్యమగును.

చ. దగఁగొనియున్న పాంథుఁడటు తన్ విని సారసపక్షికూఁత, దా
నొగిఁదరువాటిక్రేవ నదియున్నదటం చలరారుమాడ్కి, మే
లగుప్రియురాలు చెంతఁగలదంచును నీవు వచింపఁ జింతచేఁ
బొగిలెడినాదు డెందమును బొందెను నిందు నమందమోదమున్.

ఆమె యెక్కడ?

విదూ:—అదిగో చెట్లచాలునడుమనుండి వెలువడి యీవంకకే మరలి కనఁబడుచున్నది.

రాజు:—ఆమెను జూచినాను.

గీ. ఘననితంబము నిఱుపేదకౌనుఁ గలిగి
బటువులైనట్టి గబ్బిగుబ్బలను దనరి
నిడుదలౌ వాలుఁగన్నులు నెఱయ నిటకె
చేరవచ్చెడు నదిగో నాజీవితంబు.

మిత్రుఁడా! ఆమె పూర్వముకంటెఁ గ్రొత్తయవస్థ పొందియున్నది. ఎట్లన-

గీ. రెల్లుపువుఁబోలె జెక్కులు తెల్లవాఱె
పరిమితములైన భూషణావళులఁ దాల్చి
పఱలెడు వసంతమునఁ బాండుపత్రవితతి
మూఁగఁ బూఁతపట్టెడుమల్లెతీఁగఁ బోలి.

విదూ:—ఈమెయు నీవలెనే మన్మథవ్యాధిచేతనే బాధనొందుచుండియుండును.

రాజు:—నామీఁది ప్రేమచేత నీకట్లగపడుచున్నది.

మాళ:—ఈవృక్షమును లలితసుకుమారదోహదము నపేక్షించి పుష్పాలంకారము లేక యుత్యాతురనయియున్న నావలెనే శోకమభినయించుచున్నట్లున్నది. కాఁబట్టి దీనినీడచేతఁ జల్లఁగానున్న యీరాతిమీఁద గూరుచుండి వేడుకతోఁ బ్రొద్దుపుచ్చెదను.

విదూ:—ఆమె యుత్యాతురనయి యున్నానని చెప్పుచున్నది విన్నావా?

రాజు:—ఇంతమాత్రముచేత నీయూహ సరియయినదని నేనెంచను. ఎందుచేతనన—

క. కురువకకుసుమరజముంగొని,
పరశీకరముల ధరించి, వంచి చిగుళ్ళన్,
దరుణుల నిష్కారణముగ
మరియాతురపెట్టవచ్చు మలయానిలుఁడున్.

మాళ:—(కూడుచున్నది)

రాజు:—మిత్రుఁడా! మన మీమాతీఁగెలచాటున దాఁగియుందము రమ్ము.

విదూ:—దూరమున నిరావతివలెఁ గనఁబడుచున్నది!

రాజు:—పద్మలతను జూచినయేనుఁగు మొసలిని లక్ష్యము చేయదు. (అని చూచుచున్నాఁడు)

మాళ:—ఓహృదయమా! నేను నిరాధారను గనుక దుర్లభమైన యీకోరికనువిడువుము. నన్నేల నిట్లాయాస పెట్టెదవు?

విదూ:—(రాజువంకఁ జూచుచున్నాఁడు.)

రాజు:—ప్రేమయొక్క మహిమచూడుము.

గీ పలుకవు నిమిత్త మామనోవ్యథకు నీవు,
తత్త్వమరయంగ నూహకుదరముగాదు;
లలనరో! యట్లయిన నీవిలాపమునకుఁ
గారణము నేనయంచు నిక్కముగఁ దలఁతు.

విదూ:—దేవా! ఇప్పుడే మీసంశయము నివర్తియగును. నేను మీమదనసందేశమును జెప్పిన వకుళావళిక యొంటిగా నీలాగున వచ్చుచున్నది.

రాజు:—అది ప్రార్థన మఱచిపోయినదేమో!

విదూ:—ఇప్పుడా బానిసకూఁతురు మహాత్తరమయిన దేవరవారిసందేశము నేల మఱచును?

[పాదాలంకారములతో వకుళావళిక ప్రవేశించుచున్నది.]

వకు:—నా సఖికి క్షేమమా?

మాళ:—ఓహో! వకుళావళికా! వచ్చితివా? నీకు స్వాగతము. కూరుచుండుము.

వకు:—(కూరుచుండి) ఓసీ! నీవిప్పుడు యోగ్యమయినపనికి నియమింపఁబడినావు. నీకాలొకటి నావంకఁజూపుము, లత్తుకపెట్టి నూపురము తొడిగెదను.

మాళ:—(తనలో) ఓహృదయమా! యీవైభవము లభించిన దని సంతోషింపఁబోకుము. నాకీదుర్దశ యెట్లు తొలఁగును? కానిమ్ము నాకిదే మరణాలంకారము కాఁగలదు.

వకు:—నీలో నీవేమియాలోచించుచున్నావు? దేవిగారి కాంచనాశోకము పుష్పించునాయని యాతురపడుచుండెదరుగదా?

రాజు:—ఏమీ? ఈప్రయత్నమంతయు నశోకవృక్షదోహదము నిమిత్తమా?

విదూ:—ఏమీ? దేవిగారు కారణములేక యీయంతఃపురాభరణములతో నీమె నలంకరింప నియమించియుండదని మీకుఁ దెలియదా?

మాళ:—(కాలుచాఁచి) సఖీ! ఇప్పుడు కాలికి నొప్పి కలుగనీకుము.

వకు:—సఖీ! నీవు నాశరీరము వేరకదా?

(అని పాదాలంకారము చేయునట్లు నటించుచున్నది.)

రాజు:—గీ. సఖుఁడ! చూడుము ప్రియురాలి చరణమునకు
లేఁతగానిడ్డ లత్తుకలేఖ యదిగొ
హరుని చేదగ్ధమైన యనంగవృక్ష
మునకుఁ దొలిపల్లవంబన మురువుచూపు!

విదూ:—దేవిగారీమెకు నియమించినదని యీపాదమునకుఁ దగియున్నది.

రాజు:—నీవు చక్కఁగా చెప్పినావు.

చ. వరనఖకాంతినొప్పి నవపల్లవరాగము చేత నార్ద్రమౌ
తరుణిప్రశస్తపాదమునఁ దన్నఁగవచ్చును కెంటినింకఁ; గ్రొ
వ్విరు లవిలేక దోహదము వేఁడు నశోకము నైన, లేని దో,
శిరమును వంచి నేరమును జేసిన కాంతుని నైన, మిత్రుఁడా!

విదూ:—నీవే యీమెయెడ నేరము చేసినవాఁడ వగుదు వేమో!

రాజు:—అమోఘకార్యసిద్ధుఁడవయిననీ బ్రాహ్మణవాక్యమును శిరసావహించెదను.

[అప్పుడు మత్తుగొనియున్న యిరావతి చేటికతోఁ గూడఁ బ్రవేశించుచున్నది]

ఇరా:—సఖీ! నిపుణికా! స్త్రీలకిటువంటిమత్తత విశేషాలంకారమని నేను బలుమారు వినుచువచ్చినాను. ఈలోకోక్తి సత్యమేనా?

నిపు:—ఇది మొదట లోకప్రవాదమో కాని యిప్పుడు సత్యమేయయినది.

ఇరా:—ఓసీ! నాయందలిప్రేమ నటుండనిమ్ము. ఉయ్యాలయున్న గృహమునకు భర్తనాకంటె ముందుగాఁ బోయియుండునని నీ విప్పుడెట్లు తెలిసికొంటివో నాకుఁ జెప్పు.

నిపు:—అమ్మా! నీయందలియఖండప్రేమచేతఁ బోయియుండు నని తెలిసికొంటిని.

ఇరా:—ఈయుపచారవృత్తి చాలించి మధ్యస్థతను వహించి చెప్పుము.

నిపు:—వసంతోత్సవమునందలి నైవేద్యములను మెసగిన గౌతముఁడు నాతోఁ జెప్పినాఁడు. అమ్మగారు త్వరపడవలెను.

ఇరా:—(అవస్థకు తగినట్లుగా కొంచెము నటించి) సఖీ! మత్తు చేత బాధపడుచున్న నను రాజుగారి దర్శననిమిత్తము చిత్తము త్వర పెట్టుచున్నది కాని కాళ్ళుమాత్రము సాగకున్నవి.

నిపు:—మనమిప్పు డుయ్యెలనున్న వసంతగృహమునకు వచ్చి యున్నారము.

ఇరా:—నిపుణికా! భర్తగారిక్కడఁ గనఁబడరే?

నిపు:—అమ్మగారు తిన్నఁగాఁ జూడవలెను. పరిహాసార్థముగా రాజుగారిం దీఁగెలలోనో గూఢముగా దాఁగియుందురు. మనమును బ్రేంకణపులతా పరివృతమయిన యీయశోకవృక్షముక్రింద శిలాపట్టమునకుఁ బోవుదము.

ఇరా:—ఆలాగే.

నిపు:—(చూచి) అమ్మా చూడుము. క్రొమ్మావిగున్నను వెదకుచున్న మనకిప్పు డెట్టచీమ కానఁబడుచున్నది.

ఇరా:—అదియేమి?

నిపు:—ఇదిగో యశోకవృక్షముయొక్క నీడను వకుళావళిక మాళవికకుఁ జరణాలంకారము చేయుచున్నది.

ఇరా:—(శంకను గనఁబఱచి) ఇది మాళవిక యుండవలసిన చోటుకాదు. నీవేమని యూహించెదవు?

నిపు:—ఉయ్యెలనుండి పడుటచేతఁ గాలు నొప్పిపెట్టినదయి దేవిగారశోకదోహదకార్యమునకు మాళవికను నియోగించిరని యూహించెదను. అట్లుకానియెడల దేవి తానుధరించుకొనెడి యీయందెల జతను బరిజనము పెట్టుకొనుటకెట్లు నియమించును?

ఇరా:—ఇది దీనికి గొప్పగౌరవము.

నిపు:—నీవు రాజుగారి నేల వెదకవు?

ఇరా:—సఖీ! నాపాదములు ముందుకు నడువకున్నవి. నామనస్సు కళవళపడుచున్నది. ఈలోపల నాజంకు తీర్చుకొనియెదను.

(అని మాళవికనుజూచి తనలో) నామనస్సులో భీతికలుగుటకు హేతువు లేకపోలేదుకదా?

వకు:—(పాదమునుజూచి) ఏమి? ఈలత్తుకరేఖలనుదీర్చుట నీకింపుగానున్నదా?

మాళ:—నాకాలిమీఁద నుండుటచే దీనిని నేను బ్రశంసించుటకు లజ్జపడుచున్నాను. ఈశిల్పకళాకౌశలమును నీవెవరివద్ద నేర్చుకొన్నావు?

వకు:—నేనిప్పుడు రాజుగారి శిష్యురాలను.

విదూ:—నీవిప్పుడు గురుదక్షిణము పొందుటకు వేగిరము రమ్ము.

మాళ:—అదృష్టవంతురాలనని గర్వపడఁబోకుము.

వకు:—ఉపదేశమునకుఁ దగినపాత్రము లభించినదిగనుక నేనిప్పుడు గర్వమునే పొందెదను. (లత్తుకరచనను చూచి తనలో) నాపని నేను జక్కఁగా నిర్వహించితిని. (ప్రకాశముగా) సఖీ! నీపాదమున కొకదానికి లత్తుకపెట్టుట యయినది. ఇఁక నోటితో నూఁది తడి యార్చవలెను. అక్కఱలేదు ఆపని యిక్కడిగాలియే చేయుచున్నది!

రాజు:—మిత్రుఁడా! చూడుచూడు.

గీ. పచ్చిలత్తుకచేఁ దడిపాయకున్న
పాదమూఁదంగ నాముఖవాయువునను
జక్కఁగానూఁది తగుసేవసలుపనాకు
నుత్తమంబైన యవకాశ మొదవెనిపుడు.

విదూ:—మీకీచింతయెందుకు? ఈసేవమీకుఁ జిరకాలమనుభవింప లభించునులెండి.

వకు:—సఖీ! నీపాదము కెందామరవలె శోభిల్లుచున్నది. నీవిప్పుడు సర్వదా రాజుగారియొడిలోఁ జేరుదానివలె నున్నావు.

ఇరా:—(వకుళావళిక ముఖముకేసి చూచుచున్నది.)

రాజు:—ఇది నాకాశీర్వాదము.

మాళ:—ఓసీ! అవినయవాక్యములు పలుకకు,

వకు:—నేను బలుకఁదగినదానినే పలికినాను.

మాళ:—అట్లయిన, నేను నీకుఁ బ్రియురాలను గానా?

వకు:—నాకుమాత్రమే కాదు.

మాళ:—మఱియెవరికిఁగూడ?

వకు:—గుణగ్రాహులయిన రాజుగారికిఁగూడ?

మాళ:—నీవుమాయమాటలు చెప్పుచున్నావు. నాయందట్టి గుణ మేదియు లేదు.

వకు:—సత్యము. నీయందుగాదు. నాకదికృశించి తెల్లవాఱిన రాజుగారి సుందరాంగములయందుఁ గనఁబడుచున్నది.

విదు:—మొదట గుణించుకొనివచ్చినట్లే యీచెడుకడఁతుక యుత్తరము చెప్పుచున్నది!

వకు:—అనురాగ మనురాగముచేతనే పరీక్షింపఁదగిన దన్న సుజనవాక్యమును బ్రమాణము చేసికొమ్ము.

మాళ:—నీవేల ఇచ్చవచ్చినట్లెల్లను వదరెదవు?

వకు:—కాదు కాదు. ప్రేమచేత మృదువులయిన యివి మఱి యొకరినోటినుండివచ్చిన రాజుగారివాక్యములే సుమా?

మాళ:—సఖీ! దేవిని దలఁచుకొని నాహృదయమీమాటలను విశ్వసింపకున్నది.

వకు:—ఓసీముద్దరాలా! తుమ్మెదబాధ యున్నదని వసంతకాలమునఁ గలిగిన క్రొమ్మామిడిపూ వలంకరించుకోఁగూడదా యేమి?

మాళ:—దుర్లభపదార్థాపేక్ష పొందియున్నవాకు నీవు సహాయురాలవగుదువా?

వకు:—నేను మర్దించినకొలఁదిని బరిమళించు వకుళావళికను జుమా.

రాజు:—మేలు! వకుళావళికా! మేలు!

ఉ. భావమెఱుంగనైనపిదపం దగఁ బ్రస్తుతవాక్చయంబులన్
కేవలముం దిరస్కృతి జనించినచో నుచితోత్తరంబులన్
జేవమెయి న్నివేదనము చేసి మదీయనిదేశ మిచ్చుటన్;
జీవములిట్లు దూతికలచేతనె యుండును గాముకాళికిన్.

ఇరా:—సఖీ! వకుళావళిక మాళవికచేత నీకార్యమునం దమగు పెట్టించినది చూచితివా?

నిపు:—అమ్మా! నిర్వికారులకయినను సమయోచితమైన యుపదేశము వాంఛను బుట్టించును.

ఇరా:—నాహృదయముయొక్క శంక తప్పక పొందవలసినదే. ఇప్పుడు సంగతి తెలిసినందునఁ గర్తవ్య మాలోచించెదను.

వకు:—ఇదిగో నీరెండవపాదముకూడ నలకరింపఁబడినది. ఇప్పుడందెలను నీరెండు కాళ్ళకును దొడిగెదను. (అందెలు పెట్టుట నభినయించుచున్నది.) సఖీ! లెమ్ము. అశోకమును పుష్పింపఁజేయుటకయి యిఁక దేవిగారియాజ్ఞ నడుపుము. (ఇద్దఱును లేచుచున్నారు.)

ఇరా:—దేవిగారి నియోగమని విన్నాము. ఇప్పుడదిజరగనిమ్ము.

వకు:—ఇదిగో రాగాధిక్యముగల నీవనుభవింపఁదగిన వాని రూపము నీయెదుటనే యున్నదే.

మాళ:—(సంతోషముతో) భర్తాయేమి?

వకు:—(చిఱునవ్వుతో) భర్త కాఁడు. ఈయశోకమున వ్రేలుచున్న యీక్రొంజిగురు జొంపములను కర్ణాభరణముగాఁ జేసికొమ్ము.

మాళ:—(విషాదమును నటించుచున్నది)

విదూ:—ఏమి? దేవరవారు విన్నారా?

రాజు:—మిత్రుఁడా! ఇంతతోనే కాముకులయభీష్టము సంపూర్ణమగును.

చ. ఒకరికిఁ బ్రేమయుండి మఱియొక్కరికిం దగు ప్రేమ లేనివా
రికి వడిఁ బొందుకల్గినను శ్రేష్ఠముకాదది; యంతకంటెనున్

బ్రికటసమానురాగులగువారలకా మరణంబు నొందొరుక
వికలతఁగూడ నబ్బమియుఁ బెద్దయు మేలుగనెంతు నామదిన్.

మాళ:—(చిగురాకును గర్ణాభరణముగా ధరించుకొని విలాసముతో నశోకమును దన్నుటకు బాదమెత్తుచున్నది.)

రాజు:—మిత్రుఁడా!

గీ. పాదతమునుండి గ్రహియించి పల్లవంబు
మరలఁ బాదపల్లవమిఁదఁ బ్రామఁకునకును;
కోరియుభయులు నిటుమార్చుకొనుటచేత
వంచితుఁడనై తినిట్టి దేపంచు దలఁతు

మాళ:—ఈయశోకము పూచుటకయి చేయవలసినదోహదము నేను జేసితిని గదా? ఇట్లు చేసినతరువాతఁగూడ నిది పుష్పించకుండునేమో?

వకు:—సఖీ! ఇఁక నీలోపమేదియు లేదు. నీచరణసత్కారమును బొందియు శీఘ్రముగాఁ బూఁత పట్టకపోయినయెడల నీయశోకవృక్షమే నిర్గుణమగును

రాజు:—ఉ. ఈతనుమధ్యయందియల నింపగునాదము పుట్టఁగా నవా
బ్జాత సమానకోమలసుపాదమున న్నను సత్కరించినన్
బూఁతనుబట్టకున్న, నిటఁబొల్చు యశోకమ!చారుహాపశో
భాతులనాయకార్హమగునాదరమున్ వృధగాదెనీయెడన్.

మిత్రుఁడా! నేనుబోయి యవకాశముచేసికొని మాటాడఁ గోరుచున్నాను.

విదూ:—రమ్ము. నేనిప్పుడు వారిని భయపెట్టెదను.

(ఇద్దఱును ప్రవేశించుచున్నారు.)

నిపు:—అమ్మా! అమ్మా! రాజుగారు ప్రవేశించుచున్నారు.

ఇరా:—నేనిది మనస్సులో మొదటనే యాలోచించినాను.

విదూ:—(చేరఁబోయి) అమ్మా! రాజుగారెదుటనుండఁగా దేవిగారికి బ్రియమయిన యీయశోకవృక్షమును ఎడమకాలితోఁ దన్నుట నీకుఁ దగునా?

ఇద్దఱు:—(తొట్రుపాటుతో) అయ్యో! రాజుగారిక్కడనే యున్నారే!

విదూ:—బకుళావళికా! ఈమె తెలియక యవినయకార్యము చేయుచుండఁ దెలిసినదానవునీవు దాపుననుండి యొంకుకు వారించి నావుకావు?

మాళ:—(భయము కనఁబఱుచుచున్నది)

నిపు:—అమ్మా! మహానుభావుఁడైన యీగౌతముఁడేమి చేయుచున్నాఁడో చూడు.

ఇరా:—ఇట్లుగాక పోయిన మఱియె ట్లీబ్రాహ్మణాధముఁడు జీవనము చేయఁగలుగును?

వకు:—అయ్యా! ఈమె దేవిగారి యాజ్ఞాప్రకారమే చేయుచున్నది ఈయతిక్రమమునం దీమె పరాధీనురాలు, రాజుగారు క్షమింతురుగాక! (అని తాను మ్రొక్కి మాళవికచేత మ్రొక్కించుచున్నది.)

రాజు:—అట్లయినపక్షమున నీయందుఁ దప్పిదములేదు. కళ్యాణీ! లెమ్ము. (అని చేతితోఁ బట్టుకొని మాళవికను లేవదీయుచున్నాఁడు.)

విదూ:—ఇది తగును. దేవిగారు మాననీయురాలుగదా?

రాజు:—(నవ్వి)

క. జవ్వనిరో! కఠినంబగు
నివ్వసుధారుహము మొదల నిటుమోపుటచే
నొవ్వదె కిసలయకోమల
మివ్వామపదాంబుజాతి మిప్పుడు నీకుఁ?

మాళ:—(లజ్జ నభినయించుచున్నది.)

ఇరా:—(అసూయతో) ఓహో! భర్తగారు నవనీతకోమల హృదయులు గదా.

మాళ:—వకుళావళికా! తమని యోగమును నడిపితిమని దేవి గారికి నివేదింతమురమ్ము.

వకు:—సెలవుపుచ్చుకొనియెదనని రాజుగారికి విన్నవము చేయుము.

రాజు:—కళ్యాణీ! నీవు పోవచ్చును. సమయము దొరకినది గనుక ముందుగా నీవిట్టుడు నాప్రార్థనను వినుము.

వకు:—అవహితురాలవయి వినుము. దేవరవా రానతిత్తురుగాక!

రాజు:—గీ. ఈవిధమున నె యింతిరో! యీశరీర
మల రోదవకుండెఁ జిరకాలమందునుండి;
నీదున్నపూర్ణామృతంబున నెఱపుమిందు
నన్యమొల్లనినాకు దోహదమునిపుడు.

ఇరా:—(వేగముగా సమీపించి) ఈయుఁ కవశ్యముగా దోహదము చేయుము. అశోకము పూలనుమాత్రమే యిచ్చునుగాని యీ యనపూవులను ఫలములనుగూడ నిచ్చును.

[అందఱును ఇరావతినిజూచి తత్తరపడుచున్నారు.]

రాజు:—(రహస్యముగా) మిత్రుఁడా! ఇప్పుడేమిగతి?

విదూ:—మఱియేమున్నది? పిక్కబలమే.

ఇరా:—మేలు! వకుళావళికా! మేలు! ఇప్పుడు నీవుమంచిపనికి బూనుకొన్నావు. మాళవికా! భర్తగారికోరికను సఫలము చేయుము.

ఇద్దఱు:—అమ్మా! క్షమింపుము. రాజుగారిప్రణయపరిగ్రహమునకు మేమెవరము? (అని వెడలిపోవుచున్నారు.)

ఇరా:—పురుషులను నమ్మఁగూడదు. నీమాయమాటలు నమ్ముటచేతఁ బ్రియభార్యనయియుండి తిరస్కృతురాల నయిన నాకిప్పుడిదిహృదయశల్యమయినది. వేఁటకాని గీతముచేత ననుమానపడక యాకర్షింపఁబడిన లేడివలెనే నావినాశము నేను దెలిసికొలేకపోతిని.

విదూ:—(రహస్యముగా) మిత్రుఁడా! ఏదోయుత్తరము నాలోచింపుము. నీకుఁ జెప్పవలసినదేమున్నది? నీటిసమీపమున దారిలేక పట్టుపడిన దొంగవలెనే యిప్పుడు సంధిచేసికొనుటయే కర్తవ్యమని తోఁచుచున్నది.

రాజు:—సుందరీ! నాకు మాళవికతోఁ గొంచెమయినను బని లేదు నీవాలస్యము చేసినందున, పీఁతో నేను గొంచెము వినోదముగాఁ బ్రొద్దుపుచ్చుచున్నాను.

ఇరా:—మిమ్ము నమ్మఁగూడదు. భర్తగారికిటువంటి వినోదము దొరకినసంగతి నాకుఁ దెలిసినదికాదు. అట్లు తెలిసియుండినయెడల నేనీవిధముగా మీకు వినోదభంగమును జేసియుండను.

విదూ:—ఇప్పుడు రాజుగారి దాక్షిణ్యము చెడఁగొట్టుకొను ము. సమీపమునఁ గనఁబడినప్పుడు రాణిగారి పరిచారికలతోడ సంభాషించుటకూడఁ దప్పగునా? నీవే చెప్పు.

ఇరా:—వారితోడి సంభాషణమేజరగనిమ్ము. నేను నామనస్సు నేలయాయాసపెట్టుకోవలెను? (అనిరోషముతో బయలుదేఱుచున్నది.)

రాజు:—(వెంబడించి) ప్రాణేశ్వరీ! శాంతింపుము.

ఇరా:—(ఒడ్డాణమూడి కాలికిఁదగులుకొనఁగా నడుచుచున్నది.)

రాజు:—సుందరీ! ప్రేమగలవారిని నిరాదరించుటయుక్తముకాదు.

ఇరా:—ధూర్తా! నీవు నమ్మఁదగినవాఁడవుకావు.

రాజు:—గీ. 'ధూర్త' యనుమాటతోన రోతోయజాక్షి!
యనుఁగునయిన నాపయి కోప మాఱఁజెల్లు;
కాళ్ళపయిఁ ఱ్రాలి నిన్ను మేఖలయు వేఁడఁ
జండి! కోపంబు విడువంగఁజాలవేమి?

ఇరా:—ఈ చెడు మేఖలయు నిన్నే యనుసరించుచున్నది.
(అని మొలనూలుపుచ్చుకొని దానితో రాజును గొట్టఁబోవుచున్నది.)

రాజు:—మిత్రుఁడా! ఈ యిరావతి

గీ. కానునుండి యుపేక్షతోఁ గరముజాఱు
పసిఁడి మొలనూలితోడ బాష్పములు కాఱ
నుగ్రురాలయి ననుఁ గొట్టనుద్యమించె
మొయిలు మెఱుముతో వింధ్యాద్రిమోఁదునట్లు.

ఇరా:—ఏమి? ఈవిధముగా నన్ను మరలఁ దిరస్కారము చేయుచున్నావు? (అని మొలనూలితోడి చేయితీసికొనుచున్నది.)

రాజు:—క. అపరాధి నయిననాపయి
నిపుడే త్రిఁ దండ ముడిపెదేల? లతాంగీ!
యిపుడు విలాసము పెంచియుఁ
గుపితత్వము దాసునందుఁ గూర్చెదవకటా.

ఇప్పుడు నీకోపము తగ్గింపుము. (అనిపాదములమీఁద బడుచున్నాఁడు)

ఇరా:—నీకు సంతోషకరమయిన దోహదము చేయుటకివి మాళవిక పాదములు కావు (అని చేటికతోఁగూడఁ బోవుచున్నది.)

విదూ:—లెమ్ము నీవనుగ్రహింపఁబడినావు

రాజు:—(లేచి యిరావతినిగానక) ఓహో! నాప్రియురాలు విడలిపోయినదా?

విదూ:—మిత్రుఁడా! దైవవశముచేత నపీనయుఁడైనను నన్నిప్పుడు విడిచిపోయినను దానికోపమింకను దీఱలేదు. అంగారరాశివలె నీమె మరల రాకమునుపే మనము శీఘ్రముగాఁ బాఱిపోవుదము రమ్ము.

రాజు:—ఆహా! కాముని వైషమ్యము!

గీ మనసు ప్రియురాలిపైఁ జిక్కికొనిన నేను
సేవగనెయొంతు మ్రొక్కినఁ జేకొనమియు;
కూర్మిగలదయ్యు నామీఁదఁ గుపితయగుట
చేత నేను నిప్పుడుపేక్ష చేయవచ్చు.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

చతుర్థాంకము.

[అప్పుడు విచారగ్రస్తుఁడయి రాజును, ప్రతీహారియుఁ బ్రవేశించుచున్నారు]

రాజు:—(తనలో)

చ. చెవులనుబడ్డ కాంతవయిఁ జేరుచు నేరది నాటియాశచే,
నవలను రాగపల్లవము నంటుచు దృష్టికిఁ గానిపించుటన్,
దవిలి కరంబు పూచినవిధంబునురం బులకాంకురాళిచే,
జవమున గామవృక్షము రసజ్ఞుని నన్ ఫల మొందఁజేయుతన్.

(ప్రకాశముగా) మిత్రుఁడా! గౌతమా!

ప్రతీ:—దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! గౌతముఁ డిక్కడలేడు.

రాజు:—(తనలో) అయ్యో! అతఁడు మాళవిక వృత్తాంతమును దెలిసికోవచ్చుటకయి నాచేతఁ బంపఁబడినాఁడుగదా!

[విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ:—మీకు జయమగుఁగాక! జయమగుఁగాక!

రాజు:—జయసేనా! ధారణీదేవి యెక్కడనున్నదో కాలినొప్పి పోవుట కెట్లు వినోద పెట్టఁబడుచున్నదో తెలిసికొనిరమ్ము.

ప్రతీ:—దేవరయాజ్ఞాప్రకారము చేసెదను. (అనిపోవుచున్నది)

రాజు:—గౌతమా! నీసఖురాలయిన యామెవృత్తాంతమేమి?

విదూ:—పిల్లిచేతఁ బట్టుపడిన కోకిలవృత్తాంతమువలె నున్నది.

రాజు:—(విషాదముతో) ఎందుచేత?

విదూ:—ఖిన్నురాలయియున్న యామె కన్నుల నిప్పులొలుకు దేవిచేతఁ బాతాళగృహమునఁ ద్రోయింపఁబడినది.

రాజు:—నన్నుఁ దారసించినందుకుఁ గాబోలును.

విదూ:—అవును.

రాజు:—ఈవిధముగాఁ శత్రువులెవరు దేవిగారికిఁ గోపము తెప్పించినారు?

విదూ:—దేవా! వినుము. కాలినొప్పిచేత బాధపడుచున్న దేవిగారి క్షేమవార్త యడుగుటకయి యిరావతి యక్కడకుఁబోయియుండినదని పరివ్రాజిక నాతోఁజెప్పినది

రాజు:—అటుతరువాత?

విదూ:—మనప్రియవల్లభుఁడేల దర్శనమియ్యలేదని దేవియడిగినది. "మనప్రియవల్లభుఁడేమి? ప్రియవల్లభత్వము మనపరిజనముపాలయినట్లు మీకింకను దెలియనేలేదా?" అని దానికామె యుత్తరమిచ్చినది.

రాజు:—అయ్యో! ఈయుపన్యాసమువలన మాళవికమీఁదనే యనుమానముపోయినదని చింతిల్లుచున్నాను.

విదూ:—అటుతరువాత దేవి నిర్బంధపెట్టి యామెవలన నీయువినయ మంతయుఁ దెలిసికొన్నది.

రాజు:—ఏమి దానిదీర్ఘరోషము! అటుపిమ్మట జరిగినదిచెప్పు.

విదూ:—మఱియేమున్నది? మాళవికయు వకుళావళికయుఁ గాళ్ళసంకెళ్ళతోఁ నాగకన్యకలవలె సూర్యకిరణములు చొరని పాతాళగృహనివాసము ననుభవించుచున్నారు.

రాజు:—అయ్యో! పాపము!

గీ. మధురముగఁ గూయుపికమును మధుపసఖియుఁ
బెద్దగాలితోడి యకాలవృష్టిచేతఁ
గుసుమితంబగు క్రొమ్మావిగున్న విడిచి
తొఱ్ఱచేరంగ వలసెఁగా తోడులేక.

మిత్రుఁడా! ఇక్కడ మనమేమైనఁ జేయుట కవకాశమున్నదా?

విదూ:—ఏమియవకాశమున్నది? నాముద్రయుంగరమును నీకు జూపినంగాని మాళవికను వకుళావళికను విడువవలదని దేవిగారాజెఱసాలకుఁ గావలిపెట్టిన మాధవికకు గట్టియుత్తరువు చేసినారు.

రాజు:—(నిట్టూర్పువిడిచి విచారముతో) మిత్రుఁడా! ఇక్కడ జేయవలసినపని యేమి?

విదూ:—ఇప్పుడొక్క యుపాయమున్నది.

రాజు:—అదియేది?

విదూ:—(అన్నివైపులనుజూచి) మనకుఁ గనఁబడక యెవ్వరయినను విందురు నీచెవిలోఁ జెప్పెదను. (సమీపించి చెవిలోఁ జెప్పి) ఈలాగుననే చేయవలెను.

రాజు:—(హర్షముతో) ఈయుపాయము చక్కఁగాయున్నది, కార్యసిద్ధికొఱకు దీనిని బ్రయోగింపవలెను.

[ప్రతీహారి ప్రవేశించుచున్నది.]

ప్రతీ:—దేవా! రక్తచందనజలముతోఁ గలిపిన మంచిగంధమును గాలికిఁ జేతులతోఁ బరిజనులు పట్టించుచుండగా మంచుగాలి వచ్చెడిచోటఁబరుండి దేవిగారుపరివారికచెప్పుకథలువినుచుఁ బ్రొద్దు పుచ్చుచున్నారు.

రాజు:—అట్లయినయెడల మనముపోయి చూచుటకిది మంచి సమయము.

విదూ:—మీరు వేంచేయుడు. నేనును దేవిగారిని రిక్తహస్తములతోఁ జూడఁ గూడదు. కనుక నేదయిన సమకూర్చుకొని వచ్చెదను.

రాజు:—ఇది యంతయు జయసేనకుఁ జెప్పిపొమ్ము.

విదూ:—ఆలాగే (చెవిలోఁజెప్పి) యీలాగునఁ జేయవలెను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

రాజు:—జయసేనా! గాలిలో వేయఁబడిన దేవియొక్క శయనమునకు దారి చూపుము.

ప్రతీ:—దేవా! ఇటుయిటు.

[అప్పుడు పాన్పుమీఁద ధారణీదేవియు పరివ్రాజికయు యుక్తపరివారముతో బ్రవేశించుచున్నారు.]

దేవి:—అమ్మా! కథ బహురమణీయముగానున్నది. ఆపయిని—

పరి:—(చూపునిగిడించి) ఆపయిని దరువాతఁ జెప్పెదను. ప్రభువులైనవిదిశాపురాధీశ్వరులు వచ్చుచున్నారు.

దేవి:—ఆహా! భర్తగారా? (అని లేవఁబోవుచున్నది.)

రాజు:—లేవఁబోకు. ఉపచారగౌరవమింతతోఁ జాలును,

గీ. అందియలఁ బాయుటకునోర్వ కందమొదలి
పసిఁడి పీఠముపై మోపఁబడినయట్టి
నీదుకాల్నొవ్వఁగాఁ జేసి నాదుమదికి
బాధకలిగింపఁ బోలదో భవ్యవాణి.

దేవి:—ప్రాణేశ్వరా! జయము జయము.

పరి:—దేవరవారికి విజయమగుఁగాక!

రాజు:—(పరివ్రాజికకు నమస్కరించికూరుచుండి) దేవీ! నొప్పి సహింపఁదగి యున్నదా?

ధార:—కొంతగుణముగానున్నది.

[అప్పుడు బొట్టనవ్రేలు జన్నిదముతోఁ గట్టుకొని తొట్రుపాటుతో విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ:—రక్షింపుఁడు. రక్షింపుఁడు. నన్నుఁ బాము కఱచినది.

(అందఱును విషాదము నొందుచున్నారు.)

రాజు:—అయ్యో! నీవెక్కడఁ దిరిగినావు?

విదూ:—దేవిగారిదర్శనము చేయవలెనని యాచారముఁదొవ్వన బుష్పముల నిమిత్తము నేనుద్యానవనమునకుఁ బోయినాను.

ధార:—అయ్యో! పాపము! నేనేయీబ్రాహ్మణుని ప్రాణసంశయమునకు హేతుభూతురాల నయినాను.

విదూ:—అట్లుపోయి పుష్పమునిమిత్తమయి కుడిచేయియశోకవృక్షముమీఁదికిఁ జాఁచునప్పటికి, మృత్యుదేవత సర్పరూపమున

దొట్టెలోనుండి వెడలివచ్చి కాటువేసినది. ఇవిగో నావ్రేలిమీఁద రెండుకాట్లును జూడుఁడు. (అని చూపుచున్నాఁడు.)

పరి:—గీ. పాముకఱచినవారల బ్రతుకునకును
కఱచినట్టి యంగంబును నఱుకుకొండెఁ
గాల్చుకొండెను రక్తంబు గంటునుండి
తీయుటొండెను శీఘ్రంబు చేయవలయు.

ఇప్పుడు విషవైద్యులు తమపని చేయవలెను.

రాజు:—జయసేనా! ధ్రువసిద్ధిని వెంటనే పిలుచుకొనిరమ్ము.

ప్రతీ:—దేవరవారియాజ్ఞాప్రకారము చేసెదను.

(అని పోవుచున్నది.)

విదూ:—అయ్యో! నేను బాపపుచావు చచ్చుచున్నాను.

రాజు:—భయపడఁబోకు. ఒకానొకప్పుడు పాముకాటుకు విషముండదు.

విదూ:—నేనెట్లు భయపడకుండఁగలను? నా సర్వావయవములును దిమ్మిరెక్కుచున్నవి (అని విషోద్రేకమును జూపుచున్నాఁడు)

ధార:—అయ్యో! అయ్యో! ఇతఁడు విషవికారముచేత పడఁబోవుచున్నాఁడు. పట్టుకొనుఁడు.

పరి:—(తొట్రుపాటుతో పట్టుకొనుచున్నది.)

విదూ:—(రాజునుజూచి) నీకు నేను బాల్యమునుండియుఁ బ్రియమిత్రుఁడనుగా నున్నాను. ఇప్పటిప్రేమను మార్చక పుత్రహీనురాలయ్యెడు మాతల్లియోగక్షేమములకు భారమువహింపుము.

రాజు:—బెదరఁబోకు. ఇప్పుడే వైద్యుఁడు చికిత్సచేసి నిన్ను బాగుచేయును. స్థిరచిత్తుఁడవుకమ్ము.

జయ:—(ప్రవేశించి) ఓ మహారాజా! ధ్రువసిద్ధి దేవరవారి యాజ్ఞనువిని గౌతముని నక్కడకే పంపవలయునని విన్నపము చేయుచున్నాఁడు.

రాజు:—అట్లయినఁ గంచుకి సహాయముతో నీతనిని ధ్రువసిద్ధి యొద్దకుఁ జేర్పుము.

జయ:—ఆలాగే.

విదూ:—(దేవివంకఁ జూచి) అమ్మా! నేను జీవించినన జీవించకపోయినను రాజుగారి సేవకుఁడనగుటచేత మీవిషయమున జేసిన యపరాధమును క్షమింపవలెను.

ధార:—నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము.

(విదూషకుఁడును ప్రతీహారియు నిష్క్రమించుచున్నారు

రాజు:—ఖర్మఁడై యున్న యితఁడు స్వభావముచేతనే పిఱి వాఁడు. ధ్రువసిద్ధి సార్థక నామము కలవాఁడయినను గుదురునఁ యెంచకున్నాఁడు.

జయ:—(ప్రవేశించి) దేవా! జయమగుఁగాక! జయమగు గాక! సీతకుండలో వేసి చికిత్సచేయుటకయి సర్పముద్రగల యుంగ మెక్కడనైనను వెదకి సంపాదింపవలెనని ధ్రువసిద్ధియేలినవారితో మనవిచేయుమన్నాఁడు.

ధార:—సర్పముద్రగల యుంగర మిక్కడనే యున్నది ఇదిగో దీనిని బనితీఱినతరువాత మరలఁదెచ్చి నాచేతికిమ్ము.

(అని జయసేన కిచ్చుచున్నది)

రాజు.—జయసేనా! పనికాఁగానే శీఘ్రముగాఁ దీసికొనిరమ్ము

జయ:—దేవరయాజ్ఞాపించినట్లుచేసెదను(అని వెడలిపోవుచున్నది

పరి:—గౌతమునికి విషముదిగినదని నామనస్సునకుఁ బాఁ కట్టుచున్నది.

రాజు:—అట్లే జరగునుగాక!

జయ:—(ప్రవేశించి) దేవా! జయమగుఁగాక! జయమగు గాక! గౌతమునికి విషవేగముతగ్గినది. అతఁడు ముహూర్తకాలములో మరల నెప్పటివాఁడయినాఁడు.

ధార:—భాగ్యవశముచేత నేనునిందనుండి విముక్తురాలనైనాను.

జయ:—ఆలోచింపవలసిన రాజకార్యము లనేకములున్నవి గనుక దర్శన మనుగ్రహింపఁ గోరుచున్నానని మంత్రియయిన వాహతకుఁడు దేవరవారితో విన్నపము చేయుమన్నాఁడు.

ధార:—దేవరవారు కార్యపర్యాలోచనము కొఱకు విజయం చేయవలెను.

రాజు:—దేవీ! ఈప్రదేశమున నెండసోకుచున్నది. ఈబాధకు శీతలోపచారము ప్రశస్తము. కాఁబట్టి నీపాన్పును మఱియొకచోట వేయించుకొమ్ము.

ధార:—ఓపరిచారికలారా! మీరుభర్తగారు సెలవిచ్చినప్రకారము చేయుఁడు.

పరిచారికలు:—మంచిది. (అని ఆప్రకారముగా చేయుచున్నారు)

[ధారిణీదేవియు, పరివ్రాజికయు, పరివారమును, పోవుచున్నారు]

రాజు:—జయసేనా! గూఢమార్గమునఁ బ్రమదవనమునకుఁ వసికొనిపొమ్ము.

జయ:—దేవా! ఇటురండు.

రాజు:—జయసేనా! గౌతముఁడు తనయభీష్టమును నెరవేర్చినాఁడుగదా?

జయ:—నిస్సందేహముగా.

రాజు:—క. ఇష్టావాప్తికిఁ గడు ను
త్కృష్టం బిక్రియ యటంచు నెఱిఁగియుఁ గష్టం
బిష్టార్థసిద్ధియంచును
స్పష్టముగా మనసు జంకుపడియెడు నాకున్.

[విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ:—మీకు జయమగుఁగాక! జయమగుఁగాక! దేవరవారి మంగళకార్యములు సిద్ధిపొందినవి.

రాజు:—జయసేనా! నీవుకూడ నీపనికిఁబొమ్ము.

జయ:—దేవర వారాజ్ఞాపించినట్లు చేసెదను. (అనిపోవుచున్నది)

రాజు:—గౌతమా! ఇప్పుడు క్షుద్రురాలయిన మాధవికి కొంచమయిన ననుమానపడలేదా?

విదూ:—దేవిగారి ముద్రయుంగరమునుజూచి యెట్లనుమానపడును?

రాజు:—నేనుంగరమునుగూర్చి మాటాడలేదు. దేవి యేహేతువుచేత పీఠినిద్దఱిని విడిపించినది, తనపరిజనమును మాని నిన్నేలపంపినది, అని యదియడిగియుండవలెను.

విదూ:—నన్నది యీప్రశ్నలడిగినది. నేను మందుడనయినను వెంటనే సమయోచితమయిన ప్రత్యుత్తరములిచ్చినాను.

రాజు:—ఏమని?

విదూ:—జ్యోతిష్కులు రాజుగారి నక్షత్రమునకుఁ గ్రూరగ్రహబాధ కలిగినదనియు, అందుచేత నవశ్యముగాఁ జెఱలోనున్నవారినందఱిని విడిచి పెట్టింపవలయు ననియు, రాజుగారితో విన్నవము చేసిరని నేను జెప్పితిని.

రాజు:—(హర్షముతో) అటుతరువాత.

విదూ:—ఆసంగతివిని దేవి యిరావతి మనస్సునకు నొప్పి కలుగకుండుటకై "రాజుగారే విడిపింపుమన్నా" రని నన్నుఁబంపినదని చెప్పినాను. అయియుండవచ్చు, నని యందుమీఁద మాధవి కార్యసాఫల్యము చేసినది.

రాజు:—(విదూషకునిగాఁగలించుకొని) మిత్రుఁడా! నాయెడ నీకుఁ బ్రేమయున్నదికదా?

గీ. బుద్ధిగుణముననే మిత్రములకునిలను
గార్యదర్శనమిప్పుడుఁ గాదుసుమ్ము

స్నేహమునఁ గూడలభియించి నెగఁడుజూవె
కార్యసిద్ధికి సూక్ష్మమార్గంబు సఖుఁడ.

విదూ:—మీరు త్వరపడవలెను. సఖిసహితురాలయిన మాళవికను సముద్రగృహమునందుంచి మీనిమిత్తమయి యెదురుగా వచ్చినాను.

రాజు:—నేనామెను గౌరవించెదను. నీవుముందుపడుము.

విదూ:—దేవా! రండి రండి. (అని కొంచెమునడిచి) ఇదిగో సముద్రగృహము.

రాజు:—(భయముతో) మిత్రుఁడా! అదిగో చేతులతోఁ బూవులుకోయుచు నీయిష్టురాలయిన యిరావతిపరిచారిక చంద్రిక మనవైపునకేవచ్చుచున్నది. ఇప్పుడదిపోయినదాఁక మనమీగోడచాటున దాఁగుకొందము.

విదూ:—ఓహో! చోరులకును జారులకును చంద్రిక సరిపడదు గదా? (ఇద్దఱును చెప్పినట్లు చేయుచున్నారు.)

రాజు:—మిత్రుఁడా! నీచెలి నానిమిత్తమయి యెదురుచూచుచుండును. ఈగవాక్షమునుజేరి యామెను జూతమురమ్ము

విదూ:—అలాగే.

(ఉభయులును నిలుచుండి చూచుచున్నారు.)

[అప్పుడు మాళవికయు వకుళావళికయుఁ బ్రవేశించుచున్నారు.]

వకు:—సఖీ! భర్తగారికి మ్రొక్కుము.

మాళ:—ఓభర్తా! నీకు నమస్కారము.

రాజు:—వకుళావళిక నాప్రతిరూపమును నిర్దేశించిపలుకుచున్నదని శంకించెదను.

మాళ:—(హర్షముతో ద్వారముపంకఁజూచి) సఖీ! నన్ను మోసపుచ్చుచున్నావా? (అని విషాదము చూపుచున్నది.)

రాజు:—ఆమె హర్షవిషాదములకు నేను ప్రీతుఁడనయినాను.

గీ. సూర్యుఁడుదయించుచోఁ గ్రుంకుచో గరంబు
జలజము వికాస సంకోచములను దాను
బూనునట్లుగ నీపద్మముఖి ముఖంబు
క్షణములోపల కెంపు దపస్థలనుదాల్చె.

వకు:—అదుగో భర్త చిత్రపటమునం దున్నాఁడు.

ఇద్దఱు:—(మ్రొక్కి) దేవా! మేలు కలుగుఁగాక! మేలు కలుగుఁగాక!

మాళ:—సఖీ! అప్పుడు తొందరలో నిలుచుండి చూచుటచేత రాజుగారి రూపమునందు నాకాశ యెట్లు తీఱలేదో, అట్లేయిప్పుడు రాజుగారిరూపము తృప్తికరముగా నుండలేదనియే నేను భావించెదను.

విదూ:—వినుచున్నావా? నీవు కనఁబడునట్లుగాఁ జిత్రపటమునం దుండలేదని యీమె తలఁచుచున్నది. పెట్టెయందలి రత్నరాసి వలెనే యిప్పుడు నీవు యౌవన గర్వమువహించుట వ్యర్థమగుచున్నది.

రాజు:—మిత్రుఁడా! కుతూహలము గలవారయినను స్త్రీలు సహజముగా సిగ్గు గలవారుగానుందురు. చూడు—

చ. తరుణులు వేడ్కతోఁ బ్రథమదర్శన కాలమునందుఁ దద్దయుఁ
బురుషులరూపముల్ నయనముల్ తనియంగను జూడఁగోరియున్
ధరఁ దరళాయతాక్షులు మనఃప్రియులం దిలకించు పట్టునం
గరమునువిప్పి కన్గొనరుగా కనుదమ్ములనిండ నెప్పుడున్.

మాళ:—సఖీ! మొగము ప్రక్కకుఁ ద్రిప్పుకొని భర్తగారిచేఁ బ్రేమగలచూపులతోఁ జూడబడుచున్నయీమె యెవరు?

వకు:—పార్శ్వమునందున్న యిరావతికదా యీమె?

మాళ:—సఖీ! పట్టపుదేవుల నిందఱినివిడిచిపెట్టి యొక్క యీమెవంకనే తెప్పవాల్పక చూచుచుండుటచూడఁగా నాకు రాజుగారు దాక్షిణ్యములేనివారుగాఁ గనబడుచున్నారు.

వసు:—(తనలో) చిత్రపటములోనున్న రాజును నిజమయిన వానినిగా భావించుకొని యీమె యసూయను గనఁబఱచుచున్నది. కానిమ్ము. నేనదీనిచేఁ గొంచెము సేపు వినోదించెదను. (ప్రకాశముగా) సఖి! భర్తగారికీమె యత్యంతప్రియురాలు.

మాళ:—అట్లయిన నేనిప్పుడు నాహృదయము నేల యామెపైన పెట్టుకోవలెను? (అని అసూయతోఁ దిరుఁగుచున్నది.)

రాజు:—మిత్రుఁడా! చూడు చూడు.

చ. భామముడిచేత బొట్టుచెడ మోవియు నించుక సంచలింపఁగా
రమణి యసూయతో మరలి ప్రక్కకువంగెడు పెంపు వొల్చెడు
నృపుఁడు తప్పుచేత నిటు నాయికకోపముచూప జెల్లునం
చమర గురుండు నేర్పులలితాభినయంబును బట్టినట్టుగన్.

విదూ:—ఇప్పుడు నీవామె ననునయించుటకు సిద్ధముగా నుండుము.

మాళ:—ఇక్కడ బూజ్యుఁడయిన గౌతముఁడు కూడ నీమెను సేవించుచున్నాఁడే. (అనిమరల మరియొకవంకకు మరలఁబోవుచున్నది)

వసు:—(మాళవికను నివారించి) మరలవలదు. నీవిప్పుడు కుపితురాలవై యున్నావు.

మాళ:—నీవు నన్ను దీర్ఘక్రోధము కలదానినిగాఁ దలఁచెదవు. క్షణమున నాకోపము నిప్పుడే విడిచెదను.

రాజు:—(సమీపమునకుఁబోయి)

గీ. అతివ! ప్రత్యక్షదాసుఁడనగుచు నీకు.
నే ననన్యసాధారణవృత్తి నుండఁ
జిత్రగతుఁడనై యున్న నా చేష్టఁజూచి
యిపుడుకోపంబు వహియించెదేల నీవు.

వసు:—దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక!

మాళ:—(తనలో) చిత్రఫలకములోనున్న భర్తగారిమొదల నేనేల యసూయపడితిని?

(సిగ్గుతోఁదలవంచుకొని చేతులు జోడించుచున్నది)

రాజు:—(కామచాంచల్యమును గనఁబఱుచుచున్నాఁడు)

విదూ:—నీ వుపేక్షాపరునివలెఁ గనఁబడుచున్నావేమి?

రాజు:—నీసఖురాలియొక్క యవిశ్వసనీయతవలన.

విదూ:—నీకీమెయెడ నవిశ్వాస మేలగలిగినది?

రాజు:—

చ. నయనపథంబుఁజేరియు క్షణంబున నిప్పుడదృశ్యయౌను, నీ
ప్రియసఖిచేతికిం దగ లభించియుఁ జిక్కక వేగఁబోవు, నే
రయమునఁ గామపీడ నిటుగ్రాఁగ సమాగమమాయచేత, నో
ప్రియుఁడ! మదీయచిత్తమెటు వేగపయియీమెనువిశ్వసించెడున్?

వకు:—సఖీ! రాజుగారు పలుమాఱు మోసపోయినారు. కాఁబట్టి నీవిప్పుడు విశ్వసనీయురాలవు కమ్ము.

మాళ:—మందభాగ్యురాలయిన నాకు రాజుగారిపొందు స్వప్నములో సహితము దుర్లభమాయెను.

వకు:—రాజా! ఈమెకుత్తరమిమ్ము.

రాజు:—గీ. ఉత్తరంబియ్యనేల? కామోజ్వలాగ్ని
సాక్షిగా నన్నుయిప్పుడు నీసఖికి నేను
నర్పణము చేసికొనెద రహస్యముగను
సేవ్యుఁడనుగాను నేనింక సేవకుండ.

వకు:—నేననుగ్రహింపఁబడినదాననయినాను.

విదూ:—(కొంచెమునడిచి తొట్రుపాటుతో) వకుళావళికా! లేడి యశోకపల్లవములను దాఁటబోవుచున్నది. దానిని దోలివత్తము రమ్ము.

వకు:—మంచిది. (అని బయలుదేఱుచున్నది)

రాజు:—ఆవిధముగానే మీరు మమ్మునసహితము రక్షింప వలయును.

విదూ:—గౌతముఁడు మిమ్మునసహితము కాచుచుండును.

వకు:—(రహస్యముగా) అయ్యా! గౌతమా! నేను గనఁబడక దాగియుండెదను. నీవు ద్వారరక్షకుఁడవుకమ్ము.

విదూ:—మంచిది.

వకు:—(నిష్క్రమించుచున్నది)

విదూ:—ఇంతలోపల నేనిస్ఫటిక శిలావేదికమీఁద బరుండె దను. ఓహో! ఈశిలావిశేష మెంతసుఖస్పర్శనిచ్చుచున్నది.

(అని కూరుచుండి నిద్రపోవుచున్నాఁడు)

మాళ:—(భయముచేత వడఁకుచున్నది)

రాజు:—గీ. భయమువిడువుము నను(గూడ, భాసురాంగి!
తడవునీవయిఁ బ్రియంబుతగిలియుండి
నేను సహకారలతను నిందు బూనినాఁడ;
నల్లుకొను మాధవీలత వగుచునీవు.

మాళ:—దేవిగారివలని భీతిచేత నాకుఁ బ్రియమైన పనినై నను జేసికొనజాలకున్నాను.

రాజు:—నీవు భయపడవలసినపని లేదు.

మాళ:—నన్నుభయపడవలదని యుపదేశించెడు భర్తగారి ధైర్యమును వెనుక నే నిరావతియెదుటఁ జూచియున్నాను.

రాజు:—గీ. కీరవాణిరో! వినుము దాక్షిణ్యమెపుడు
క్షితిని నాయకులకుఁ గులవ్రతముసుమ్ము;
యట్టులయ్యు, నాప్రాణంబులాయతాక్షి
నిన్నెయాశించుకొని నిల్చియున్న విపుడు.

కాఁబట్టి చిరానురక్తుఁడనయియున్న నన్నుగ్రహియింపవలెను. (అని కౌఁగిలించుకొనఁబోవుచున్నాఁడు.)

మాళ:—(తప్పించుకొనుచున్నది.)

రాజు:—(తనలో) క్రొత్త కామినుల మదన విషయమయిన యవస్థ మిక్కిలి రమణీయముగా నుండును గదా?

మ. రశనా బంధము విప్పనే గ్రుచ్చుకొను కార్పం జేయికంపించు, ర
మ్యాశయంబుల్ చనుకప్పులా బలిమిమై నాశ్లేషముం జేయఁబో
భృశము న్ముద్దిడఁబోవఁ గన్నుఁ బుకొందిరిప్పు న్ముఖంబోరగా
వశమయ్యె న్సుఖ మిచ్ఛ కెక్కుడుగ నీ వ్యాజంబుచే నైనను.

[అప్పుడిరావతియు నిపుణికయుఁ బ్రవేశించుచున్నారు.]

ఇరా:—ఓసీ! నిపుణికా! సముద్రగృహము యొక్క తలవాకిట గౌతముఁడు కనఁబడినాడని చంద్రిక నీతో నిజముగా చెప్పినదా?

నిపు:—చెప్పకపోయిన యెడల అమ్మగారితో నేనేల విన్నవము చేయుదును.

ఇరా:—అట్లయినచోఁ, ప్రాణసంశయమునుండి విముక్తుఁడయిన భర్తగారి ప్రియమిత్రుని క్షేమవార్త యడుగుటకును మనమక్కడకుఁ బోదము.

నిపు:—మీమాటవలన మఱియేదో పనికికూడనని తోచుచున్నది.

ఇరా:—అవును. చిత్రపటమునందున్న భర్తగారిని ప్రసన్నునిగా జేసికొనుటకును.

నిపు:—నీవు కేవల భర్తగారినే యేల ప్రసన్నునిఁ జేసికొనరాదు?

ఇరా:—ముద్దరాలా! మనస్సుమరియొకరిమీఁదికిఁ బాఱియున్న భర్తగారు చిత్రపటమునం దెట్లున్నారో యట్లేయున్నారు నా ప్రయత్నమంతయు నుపచారమతిక్రమించి వచ్చిన సాలోచనమును బాపుకొనుట కొఱకే.

నిపు:—అమ్మా! ఇటు, ఇటు. (ఇద్దఱును నడుచుచున్నారు)

[ఒకచేటిక ప్రవేశించుచున్నది.]

చేటి:—అమ్మా! నీకు శుభమగుగాక! "ఇది మనకు మత్సరమునకుఁ గాలముకాదు. నీయెడఁగలగౌరవమును గనఁబఱచుకొనుటకొఱకే నేనిప్పుడు సఖీసహితముగా మాళవికకు సంకెళ్లు వేయించుచున్నాను. వారిని విడిపించి భర్తగారికిఁ బ్రియముచేయుటకు నీవనుమతించినయెడల, ఆప్రకారముగాఁ జేసెదను. నీయిష్టమేమో నాకుఁజెప్పి పంపుము." అని దేవిగారు నీతోఁ జెప్పుచున్నారు.

ఇరా:—నాగరికా! "దేవిగారి నీప్రకారము జేయుమని నియోగించుటకు నేనెంతటిదానను? పరిజనులను శిక్షించుటచేత దేవిగారు నాయందు గొప్ప యనుగ్రహము చూపినారు. నేనుమాత్రమెవరి యనుగ్రహమువలనవర్ధిల్లినదానను?" అని దేవిగారికి విన్నపముచేయుము.

చేటి:—అలాగే. (అని నిష్క్రమించుచున్నది.)

నిపు:—(కొంచెమునడిచిచూచి) అదుగో గౌతముఁడు సముద్రగృహద్వారమునం దంగడిలోని యాఁబోతువలెనే కూరుచుండి నిద్రపోవుచున్నాఁడు.

ఇరా:—ఇతనికి దిన్నఁగాఁ గుదురలేదేమో? ఇంకను విషవికారమున్నవానివలెనే కనఁబడుచున్నాఁడు.

నిపు:—ముఖవర్ణము ప్రసన్నమయియే కనఁబడుచున్నది. అదిగాక ధ్రువసిద్ధిచికిత్సచేసినాఁడు. అందుచేత మనమితని కొకకీడు కలుగునని శంకింపవలసిన పనిలేదు.

విదూ:—(పలవరించుచున్నాఁడు) అమ్మా! మాళవికా!

నిపు:—అమ్మా! విన్నావా! ఈతఁడెవరికాప్తుఁడు? ఈకృతఘ్నుఁడు కేవలకుక్షింభరణపరాయణుఁడు. ఎల్లప్పుడును మనవద్ద స్వస్తివచనమోదకములచేతఁ గడుపునింపుకొనుచు, ఇప్పుడు మాళవికయని పలవరించుచున్నాఁడు.

విదూ:—మాళవికా! ఇరావతిని మించినదానవుకమ్ము.

నిపు:—ఏమి! ఈకఱ్ఱలాభమా? పామన్న భయపడెడి యీబ్రాహ్మణాధముని బామువలె వంకరగానున్న యీకఱ్ఱతో స్తంభముచాటున దాఁగియుండి భయపెట్టెదను.

ఇరా:—ఈకృతఘ్నుఁడు పాముకఱువవలసినవాఁడే.

నిపు:—(విదూషకునిమీఁద దండకాష్ఠమును బడవేయుచున్నది)

విదూ:—(ఉలికిపడిలేచి) అయ్యో! మిత్రుఁడా! నామీఁదఁ బాముపడ్డది.

రాజు:—(తొందరపడివచ్చి) భయపడకు భయపడకు.

మాళ:—(వెనుకనుంచి) భర్తా! పా మనుచున్నాఁడు. సాహసముచేసిపోవలదు.

ఇరా:—అవురా! భర్తకూడ నీలాగుననే వచ్చుచున్నాఁడు.

విదూ:—(పెద్దపెట్టునవ్వి) ఇదియు దండకాష్ఠమేనా? నేనప్పుడు మొగలిముండ్లతో గీచుకొని పాముకఱచినదని బొంకినదానికి ఫలమే యిప్పుడు కలిగినదనుకొన్నాను.

[అప్పుడు తెరవెనుకనుండి వకుళావళిక ప్రవేశించుచున్నది.]

వకు:—భర్తగారు రావలదు. ఇక్కడసర్పమువలెనే కుటిలవర్తనముకలిగి యేదో కనఁబడుచున్నది.

ఇరా:—(వేగముగా రాజుగారివద్దకునడిచి) దంపతులయొక్క దివాసంకేతము నిర్విఘ్నముగా నెరవేరినదా?

[ఇరావతినిజూచి యందఱును భ్రాంతులగుచున్నారు.]

రాజు:—ప్రియురాలా! ఈయుపచార మపూర్వమయినదికదా!

ఇరా:—వకుళావళికా! భర్తగారి దూతికవయిన నీప్రతిజ్ఞ యిప్పుడు సంపూర్ణమయినదా?

వకు:—అమ్మా! శాంతింపుము. నేనేమిచేసితినో రాజుగారి నడుగవచ్చును. కప్పలు కూయునని దేవుఁడు భూమిమీఁద వర్షము కురిపింపకుండునా?

విదూ:—నీవిలాగునఁ జేయఁబోకుము. పాదములమీఁదఁ బడి నను నీవతిక్రమించి పోయినసంగతి దర్శనమాత్రముచేతనే యీయన మఱచిపోయినాఁడు. నీవిప్పుడయినను బ్రసాదమును జూపకున్నావు.

రాజు:—ఈప్రకారము నిష్కారణముగాఁ గోపబడుటనీకుఁ దగదు.

గీ. నిర్నిమిత్తంబ క్షణమేని నీముఖంబు
పడఁతి, యెప్పుడు మును కోపపాత్రమయ్యె?
పర్వమునఁ గాక చంద్రబింబంబు రాహు
కలుష మెట్లొనొకో రాత్రి తెలుపుమీవు

ఇరా:—నిష్కారణముగానని భర్తగారు చక్కఁగా సెలవిచ్చినారు! నాభాగ్యమన్యుల పాలయినప్పుడు నేనుమరలఁ గోపబడిన పక్షమున నేనే హాస్యాస్పదురాల నగుదునుగదా?

రాజు:—నీవన్యవిధముగాఁ గల్పించుకొనుచున్నావు. నాకు నిజముగా నీకోపమునకు హేతువు కనఁబడకున్నది. ఎట్లన—

గీ. పండుగుదినంబులందునఁ బరిజనంబు
తప్పుగల్గియుఁ జెఱనుండఁ దగదటంచు
వీరినేవిడిపింప; నన్ జేరి మ్రొక్క
వీరువచ్చిరింతియకాని వేఱులేదు.

ఇరా:—నిపుణికా! నీవుపోయి మీాకత్తుపాతము కనిపెట్టితినని దేవిగారితో విన్నవింపుము.

నిపు:—ఆలాగే. (అని పోవుచున్నది.)

విదూ:—(తనలో) అనర్థము సంభవించినది. బంధమునుండి తప్పించుకొన్న యింటిపావురము పిల్లి కంటఁబడినదిగదా?

నిపు:—(మరలఁబ్రవేశించి) అమ్మా! దైవికముగా నాకిప్పుడు మాధవిక కనఁబడి దీనికి హేతువిదియని చెప్పినది.

(అని చెవిలోఁ జెప్పుచున్నది)

ఇరా!—(తనలో) నాకంతయు బోధపడినది. ఇదియంతయు నీతుచ్ఛబ్రాహ్మణుఁడు పన్నిన పన్నుగడ (విదూషకుని జూచి బిగ్గరగా) యిప్పుడిది. యీ కామతంత్ర మంత్రిగారు ప్రయోగించిననీతి.

విదూ!—అమ్మా! నేను నీతియందొక యక్షరమయినను జదివి యుండిన యెడల, యిట్లు రాజుగారి నాశ్రయించుకొని తిరుగుదునా?

రాజు:—(రహస్యముగా) అక్కటా! నేనిప్పు డీచిక్కులనుండి యెట్లువిముక్తి నొందుదును?

[వేగముగా జయసేన ప్రవేశించుచున్నది.]

జయ:—దేవా! మీ కొమార్తె వసులక్ష్మి బంతినిమిత్తమయి పరుగెత్తుచు, పండు కోఁతివచ్చి బెదరింపఁగా మిక్కిలి జడిసికొన్నది. ఆమెను దేవిగారు తమ యొడిలోఁ బెట్టుకొని కూరుచున్నను గొంచమయినను జ్ఞప్తిరాక పెద్దగాలిలోఁ గదులుచున్న చిగురాకువలె వడఁకుచున్నది.

రాజు:—అయ్యో! అయ్యో! పసిపిల్ల లెంతపిరికివారు!

ఇరా:—(తొట్రుపాటుతో) ఆచిన్నదాని నోదార్చుటకయి భర్తగారు వేగిరము విజయంచేయవలెను. ఆమెకు సంతానజనితమయిన వికారము వృద్ధిపొందకుండ వారింపవలెను.

రాజు:—నేనుబోయి జ్ఞప్తివచ్చునట్లుచేసెదను.

(అని వేగముగాఁబోవుచున్నాడు)

విదూ:—మేలు! ఓరి పింగళవానరా! మేలు! నీవు స్వపక్షము వారిని రక్షించినావు.

[రాజును, విదూషకుఁడును, ఇరావతియు, నిపుణికయు, నిష్క్రమించుచున్నారు.]

మాళ:—దేవిని దలఁచుకొని నాహృదయము కంపమొందుచున్నది. నాకిప్పుడేమి సంప్రాప్తము కానున్నదో తెలియకున్నాను.

(తెరలో) ఆశ్చర్యము! ఆశ్చర్యము! దోహదముచేసి యయిదు రాత్రులయినను గడువకమునుపే కాంచనాశోకము మొగ్గలతో నిండి పోయినది. ఈసంగతి దేవిగారికి నివేదించెదను.

ఇద్దఱు:—(వినిసంతోషించుచున్నారు)

వకు:—సఖీ! ఊఱటపొందుము. దేవి తానుజేసినప్రతిజ్ఞతప్పదు.

మాళ:—అట్లయిన మన ముద్యానవనపాలికల వెనుకనే పోవుదము.

వకు:—అలాగేచేయుదము.

(అంగణమును నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము.

[అప్పు డుద్యానవనపాలకురాలు ప్రవేశించుచున్నది.]

ఉద్యా:—నేను గౌరవపూర్వకముగాఁ గాంచనాశోకముచుట్టును గోడయరఁగును వేసినాను. నాకు నియోగించిన యీపనిని జేసితి నని దేవిగారికి నివేదించెదను. ఇఁక విధి మాళవికయందు దయచూప వచ్చును. అప్రకారముగాఁ గుపితురాలయియున్న దేవి యిప్పుడీసంతోష కరమయిన యశోకదోహదవృత్తాంతముచేతఁ బ్రసన్నురాలగును. దేవి యిప్పు డెక్కడనుండియుండును? ఆహా! అదిగో దేవిగారి పరిచారకుఁ డయిన కుబ్జవాకఁడు చతుశ్శాలనుండి వచ్చుచున్నాఁడు. అతని నడిగెదను.

[అప్పుడు చేతియందుఁ బెట్టె పట్టుకొని కుబ్జుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

(ముందుకు నడిచి) సారసా! ఎక్కడకుఁబోవుచున్నావు?

సార:—మధుకరికా! విద్వాంసులయిన బ్రాహ్మణుల కియ్య వలసిన నెలదినముల నిత్యదక్షిణను పూజ్యుఁడయిన పురోహితునిచేతి కిచ్చి వచ్చుటకయి పోవుచున్నాను.

మధు:—అది యెందునిమిత్తము?

సార:—రాజుగారి కుమారుఁడు యజ్ఞాశ్వమును రక్షించుటకై సేనాపతిచేత నియోగింపఁబడినాఁడని వినినప్పటినుండియు, యాయుర్వృద్ధికొఱకు శతశతసువర్ణపరిమాణధనము దక్షిణగానిచ్చుటకు దేవిగారు ప్రతిజ్ఞ చేసినారు.

మధు:—ఇప్పుడు దేవి యెక్కడనున్నది?

సార:—మంగళగృహమునందుఁ బీఠముమీఁదఁ గూరుచుండి విదర్భదేశమునుండి తనతమ్ముఁడయిన వీరసేనుఁడు పంపిన కమ్మను లిపికారులచేతఁ జదివించి వినుచున్నది.

మధు:—మరల విదర్భరాజు వృత్తాంతమేమయినఁ దెలిసినదా?

సార:—విదర్భరాజు వీరసేనునిక్రిందనున్న సేనాచక్రముచేత లోఁబఱుచుకొనఁబడినాఁడు; అతని దాయాదుఁడయిన మాధవసేనుఁడును జెఱనుండి విడిపింపఁబడినాఁడు. అతఁడు దూతవెంట ముందుగా శ్రేష్ఠములయిన రత్నవాహనములను శిల్పవిద్యాప్రవీణతగల పరిజనమును రాజుగారికిఁ గానుకగాఁబంపి, తాను వెనుకవచ్చి ప్రభువువారిని దర్శనము చేసికొనఁబోవుచున్నాఁడు

మధు:—నీవు పోయి నీపనిని జేయుము. నేనును దేవిగారిని సందర్శింపఁ బోయెదను. (అని యిద్దఱును బోవుచున్నారు)

ఇది ప్రవేశకము.

[అప్పుడు ప్రతీహారి ప్రవేశించుచున్నది.]

ప్రతీ:—అశోకసత్కారోత్సుకురాలయి యున్నదేవి "భర్తగారితోఁగలిసి నేఁశోకవృక్షముయొక్క పుష్పసంపదను జూడఁగోరుచున్నాను" అని రాజుగారికి విన్నవింపుమని నాకాజ్ఞయిచ్చినది కాఁబట్టి ధర్మాసనమునకు విజయంచేసెడు రాజుగారిరాకకయి నేను బ్రతీక్షించి యుండెదను. (అనితిరుగుచున్నది)

తెరలోవైతాళికులు:—ఓహో! రాజు దండము చేత శత్రుశిరస్సులమీఁద వర్తించుచున్నాఁడు!

ప్రథముఁడు:—

చ. పరభృతసుస్వరంబు తనుపన్ విదిశానదిపొంతఁదోటలో
పరరతితోడ రూపమరుపంచశరుండునుబోలె హాయిగా
విరళవసంత మీ రనుభవింపఁగ నిద్ధబలుండవైన నీ
యరి వరదానదీపరిసరాటవులన్ భవదీయభద్రకుం
జరములఁ గట్టిమహిజంబులతో వహియించునమ్రతన్.

ద్వితీయుఁడు:—

చ. ధరణి విదర్భునిన్ దడవుతాఁకున గెల్చెనసీచరిత్రమున్,
బరిఘులవంటి బాహువులబల్మిని రుక్మిణిఁగొన్నకృష్ణు స
చ్చరితముఁ, బద్యరూపమున సల్పి సురోపములైన పండితుల్
కరముఁ బఠింతు రల్లకిరథకైశికధిక్కృతి నీరతుష్టికిన్.

ప్రతీ:—అదె జయశబ్దము ప్రస్థానమును దెలుపఁగా రాజుగారిచ్చటికే విజయంచేయుచున్నారు. నేను గొంచెమాయనయెదుటనుండి తొలఁగి, ముఖద్వారతోరణము నాశ్రయించి నిలిచెదను.

(అని చాటున నిలుచున్నది)

[అప్పుడు మిత్రసహితముగా రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు:—గీ. అకట! ప్రియురాలు దుర్లభ మౌటతలఁచి,
బలముచే విదర్భుఁడు గెల్వఁబడుటవినియు
వానచే నెండచేఁ గొట్టఁబడినతమ్మిఁ
బోలి, దుఃఖమును సుఖంబుఁ బొందుమనసు.

విదూ:—నీవత్యంతసుఖవంతుఁడ వగుదువని నామనస్సునకుఁ బొడకట్టుచున్నది.

రాజు:—ఏలాగునకు?

విదూ:—ఇంతకుముందే ధారణీదేవి "అమ్మా! నీవలంకరించుట యందు సాటిలేని దానవని గర్వపడుచుందువు గనుక వివాహాలంకార రచనయందలి నీనేర్పు నిప్పుడు మాళవిక శరీరముమీఁదఁ గనఁబఱుపుము" అని పండితకౌశికితోఁ జెప్పినది. అందుచేత నామె విశేష కుతూహలముతో మాళవిక నలంకరించినది. దేవి నీమనోరథము నెఱవేర్చునేమో!

రాజు:—మిత్రుఁడా! ఎప్పుడును నాయిష్టము ననుసరించి సంచరించెడు ధారణీదేవియొక్క పూర్వచరితము విచారింపఁగా నీవు చెప్పినట్లు జరగనేవచ్చును.

ప్రతీ:—(ప్రవేశించి) దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! కాంచనాశోకముయొక్క పుష్పోద్గమసంపదను భర్తగారితోఁగూడ సందర్శింపఁగోరుచున్నానని దేవిగారు విన్నపము చేయుచున్నారు.

రాజు:—దేవి యక్కడనేయున్నదా?

ప్రతీ:—అవును. వారివారి కర్హమైన సమ్మానముచేసి యంతఃపురజనమును బంపివేసి పరిజనముతో మాళవిక ముందునడువఁగా దేవి తాను దేవరవారిరాకకయి, నిరీక్షించుచున్నది.

రాజు:—(సంతోషముతో విదూషకునివంకఁ జూచి) జయసేనా! నీవు ముందునడువు.

ప్రతీ:—దేవా! రండిరండి. (అనినడుచుచున్నది.)

విదూ:—(చూచి) ఓమిత్రుఁడా! వసంతుఁడీయుద్యానవనము సందుఁ గొంచెము యౌవనదశనుబొందినవానివలెఁ గనఁబడుచున్నాఁడు.

రాజు:—నీవన్న మాట సత్యము.

గీ. వంగి కురువక ఫలజాలభారమునను
జూతభూరుహ మల్లదె చూడు మొదట
రహిని నీయుతుయౌవనారంభమనఁగి
మదికి నుత్కంఠ గొలిపెడు మరియుమరియు.

విదూ:—మిత్రుఁడా! అదిగో కాంచనాశోకమలంకారముచేసి కొన్నదానివలెనే పూవుగుత్తులచేత నొప్పుచున్నది. దేవరవారు చిత్తగించవలెను.

రాజు:—ఇప్పుడిది యనన్యసాధారణమయిన శోభను వహించుచున్నదిగనుక ఆలస్యముగాఁ బూఁతపట్టుటయే యుక్తముగానున్నది చూడు—

గీ. మొదలను వసంతవిభవంబు పూనినట్టి
సకలసుందరాశోకవృక్షములసొంపు
దోహదమునొందియున్న యీద్రుమమునందె
సంక్రమించెననఁగ మొగ్గచాలు పొలుచు.

విదూ:—నిశ్చయముగా నీవు సంతుష్టుఁడవు కమ్ము. మనమీప్రకారముగా సమీపమునకు వచ్చియున్నను, ధారిణీదేవి తనపార్శ్వమునందున్న మాళవిక నిలుచుట కనుమతించుచున్నది.

రాజు:—(సంతోషముతో) సఖుఁడా! చూడుచూడు.

క. వినయమునం బ్రియురాలటు
వెనుకఁ గరాబ్జములుసాఁచి వేడ్కను నిలువన్
నను దేవి యెదుర్కొనియెసుఁ
బొనరఁగ నృపలక్ష్మితోడి భూదేవియనన్.

[అప్పుడు మాళవికయు, ధారణీదేవియు, పరివ్రాజికయు, అర్హపరివారమును ప్రవేశించుచున్నారు.]

మాళ:—(తనలో) నా కౌతుకాలంకారమునకు హేతు వెఱుఁగుదును. అయినను నాహృదయము తామరాకులోనినీటివలెఁ దల్లడిల్లుచున్నది. నా యెడమకన్ను బలుమాఱదరుచున్నది.

విదూ:—ఓహో! మిత్రుఁడా! వివాహాలంకారముచేతఁ బూజ్యురాలయిన యీమాళవిక మిక్కిలి శోభిల్లుచున్నదిగదా?

రాజు:—ఆమెను జూచుచున్నాను.

గీ. చాలవ్రేలినిపట్టు వస్త్రంబు గట్టి
మితవిభూషణములతోడ మెఱయు నీమె
హిమము గ్రమ్మని నక్షత్రసమితితోడఁ
బ్రబలచంద్రికగల చైత్రరాత్రిఁబోలి.

ధార:—(సమీపించి) ప్రాణేశ్వరా! జయ ముగుగాక! జయముగుగాక!

విదూ:—అమ్మా! వర్ధిల్లుము

పరి:—దేవా! విజయముగుఁగాక!

రాజు:—అమ్మా! నమస్కరించుచున్నాను.

పరి:—అభీష్టసిద్ధి యగుఁగాక!

ధార:—(చిఱునవ్వునవ్వి) ప్రాణేశ్వరా! తరుణీజనసహాయుఁడవయిన నీకీయశోకవృక్షము మాచేత సంకేత గృహముగాఁ జేయఁబడినది.

విదూ:—గుత్రేఁడా! నీవు సత్కరింపఁబడినావు.

రాజు:—(సిగ్గుతో అశోకమువంకఁ దిరిగి)

గీ. అలవసంతనియోగ మనాదరించి
యాదరించె నీకు ప్రియత్న మలరుఁబూని
కావునను నిట్టిదేవి సత్కారమునకు
నియ్యశోక మర్హత నేల యొనయకుండు?

విదూ:—ఓయీ! వరువముగలదానిని జూడుము.

ధార:—ఎవతెను?

విదూ:—నేను గాంచనాశోకముయొక్క పుష్పశోభను గూర్చి చెప్పుచున్నాను. (అందఱును నూరుచున్నారు)

రాజు:—(మాళవికనుజూచి తనలో) సన్నిధినుండియు విరహాగమనుభవించుట కష్టముగదా?

క. ఏను రథాంగము మాడ్కిని
గానంగాఁ జక్రవాకిగతిఁ బ్రియురాలున్
మానెఱపొం దొదవింపని
తానీధారణి నిశవలెఁ దనరెద మిచట౯.

కంచు:—దేవా! జయమగుఁగాక! "అప్పుడు మార్గాయాసము చేత దేహములు బడలియున్నారని విదర్భరాజు కానుకగాఁ బంపిన శిల్పవిద్యాప్రవీణ లయిన యిద్దఱు కాంతలను దమదర్శనమునకుఁ బంపలేదు. వారిప్పుడు దేవరవారిని సందర్శింపశక్తి గలవారుగా నున్నారు. కాఁబట్టి దేవరయాజ్ఞ దయచేయవలెను"అని మంత్రి విన్నపము చేయుచున్నాఁడు.

రాజు:—వారిని దీసికొనిరమ్ము

కంచు:—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అని నిష్క్రమించి వారితోఁగూడ బ్రవేశించి) అమ్మలారా! ఇటు. ఇటు.

ప్రథమ:—(రహస్యముగా) ఓసీ! రజనికా! ఈయపూర్వమైన రాజకులమును జేరఁగా నామనస్సూరట పొందుచున్నది.

ద్వితీయ:—జ్యోత్స్నికా! నాకును నాలాగుననేయున్నది. "హృదయముయొక్క యవస్థయే రాఁబోవుసుఖమునుగాని దుఃఖమునుగాని తెలుపు"నని యొకలోకోక్తి యున్నదిసుమా.

ప్రథమ:—అది యిప్పుడు సత్యమగునుగాక!

కంచు:—అదె రాజుగారు దేవితోఁగూడ నుండియున్నారు. మీ రాయనయొద్దకుఁబొండు. (ఇద్దరు సమీపమునకుఁబోఁగా మాళవికయు, బరివ్రాజికయు వారినిజూచి యొకరినొకరు చూచుకొనుచున్నారు.)

ఇద్దఱు:—(ప్రణామముచేసి) దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! దేవీ! జయమగుఁగాక! జయమగుగాక!

రాజు:—కూరుచుండుఁడు.

ఇద్ద:—(కూరుచున్నారు)

రాజు:—మీ కేవిద్యయందభినివేశముఁగలదు?

ఇద్ద:—దేవా! సంగీతవిద్యయందు.

రాజు:—దేవీ! వీరిలో నొకరిని నీవు తీసికొమ్ము.

ధార:—మాళవికా! వీరిలో సమర్థురాలయిన యెవరిని సంగీతమునందు సహాయురాలినిగాఁ దీసికొనుటకు నీకిష్టముగానున్నది?

ఇద్ద:—(మాళవికను జూచి) ఓహో! రాజపుత్రిక! రాజపుత్రీ! జయముగుఁగాక! జయముగుఁగాక! (అని నమస్కరించి యామెతోఁ గూడఁ గన్నీరువిడుచుచున్నారు.)

అందఱు:—(అద్భుతపడి చూచుచున్నారు.)

రాజు:—కాంతలారా! ఈమె యెవరు?

ఇద్ద:—ఈమె మా రాజుగారికొమార్తె.

రాజు:—ఏలాగున?

ప్రథమ:—దేవా! దేవరవారు దండనాథులచేత విదర్భరాజును లోఁబఱుచుకొని చెరసాలనుండి విడిపించిన మాధవసేనుఁడను రాజకుమారునకుఁ జెల్లెలయిన మాళవికయీమె.

ధార:—ఏమీ! యీమె రాజపుత్రికా? మంచిగంధపుకఱ్ఱ నాచేఁ బాదుకగా నుపయోగింపఁబడి దూషితమయినది.

రాజు:—ఈమె కీదశ యెట్లు సంభవించినది?

మాళ:—(నిట్టూర్పువిడిచి తనలో) విధివియోగముచేత

ద్వితీయ:—దేవరవారు వినవలెను. మా రాజకుమారుఁడయిన మాధవసేనుఁడు దాయాదునివశమునఁ జిక్కఁగా నాతనిమంత్రియైన సుమతి మాబోఁటిపరిజనమును విడిచిపెట్టి యీమెను రహస్యముగా దీసికొనిపోయినాఁడు.

రాజు:—ఇంతవరకు మేమీవరకే విన్నాము. అటుతరువాత?

ద్వితీ:—దేవా! అటుతరువాతజరిగినది మాకు తెలియదు.

హరి:—అటుతరువాత జరిగినది మందభాగ్యురాలనయిన నేను వినిపించెదను.

ఇద్ద:—రాజపుత్రీ! ఈకంఠస్వరము పూజ్యురాలయిన కౌశికిది వలెనున్నది. ఆమె కాదుగదా?

మాళ:—అవును. ఆమెయే.

ఇద్ద:—యతివేషధారిణియైయున్న యీయామె నిప్పుడానవాలు పట్టుటయే కష్టముగా నున్నది—అమ్మా! నీకు నమస్కారము.

హరి:—మీయిద్దఱకును శుభమగుఁగాక!

రాజు:—అమ్మా! మీరు గిరాప్రవర్గములోనివారా?

హరి:—అవును.

విదూ:—అట్లయిన మీరిప్పుడు పూజ్యురాలయిన యీయామె వృత్తాంతము నంతను బూర్ణముగాఁ జెప్పివేయుఁడు.

హరి:—(విచారముతో) అంతయు వినుఁడు. మాధవసేనుని మంత్రియయిన సుమతి నాకన్నగారు తెలిసినదా?

రాజు:—తెలిసినది. అటుతరువాత?

హరి:—ఈమె తోడఁబుట్టినవాఁడా విధముగాఁ బోఁగా గూఢముగా నీమెను వెంటఁబెట్టుకొని తమతో సంబంధము చేయవలెనను కోరికతో నతఁడు విదిశానగరమునకు వచ్చుచున్న సార్థవాహులతో బయలుదేఱినాఁడు.

రాజు:—అటుపిమ్మట?

హరి:—అతఁడును దారినడచిన వణిగ్జనమువలెనే యడవిలోఁ బ్రవేశించి విశ్రాంతి పొందుట కారంభించెను.

రాజు:—ఆవయిని మఱియేమున్నది?

ఉ. బాహులమధ్యఁ దూణములపట్టములిట్టటు గట్టియుండ, ను
త్సాహము పుట్టఁ బాదములదాఁకను వ్రేలఁగ బర్బరమ్ముల్,

సాహసలీల వార్చుచును జాపములన్ ధరియించి, చోర సం
దోహము చేరుమాత్రమున దుస్సహమై కనుపట్టె నవ్వడిన్.

మాళ:—(భయముకనఁబఱచుచున్నది)

విదూ:—అమ్మా! భయపడఁబోకు. ఈమెయీవఱకు జరిగిన కథనే చెప్పుచున్నది.

రాజు:—తరువాత, తరువాత.

పరి:—అప్పుడు బద్ధాయుధులయిన సార్థవాహయోధులు ముహూర్తకాలములో దొంగలచేతఁ దఱుమఁగొట్టఁబడినారు.

రాజు:—అమ్మా! పాపము! ఇఁకఁ జెప్పఁబోవునది కష్టకథ కాఁబోలు!

పరి:—అటుతరువాత నాసోదరుఁడు—

గీ. ఆదురాత్ములచేతఁ గీడడరునంచు
భయపడుచునున్నయీమెఁ గాపాడుకొఱకుఁ
దాను బ్రిభుభక్తి మెరయ దుస్త్యజములైన
ప్రాణములనిచ్చి తీర్చెఁబో స్వామిఋణము.

ప్రథమ:—కటకటా! సుమతిహతుఁడయ్యెనా?

ద్వితీయ:—అందుచేతనే యీరాజపుత్రిక కిట్టివంటి యవస్థ పట్టినది.

పరి:—(కన్నుల నీరువిడుచుచున్నది)

రాజు:—అమ్మా! శరీరములకాశపడనివారి లోకయాత్ర యిట్టువంటిదే. తానుదిన్న ప్రభువునన్నము సఫలము కావించుకొన్న యాపుణ్యాత్మునికొఱకు శోకింపవలసిన పనిలేదు.

పరి:—నేనప్పుడు మూర్ఛపోయి మరలఁ దెలివితెచ్చుకొనులోపల నీమె కంటికగపడకపోయినది.

రాజు:—అప్పుడమ్మగారు పొందినకష్టము మహత్తరమయినదయియుండును.

పరి:—అప్పుడు నేనన్నగారిశరీరమున కగ్నిసంస్కారముచేసి మరలఁ గొ్రత్తగాఁదోఁచిన వైధవ్యదుఃఖముతోఁ గాషాయవస్త్రము లను ధరించి మీదేశము ప్రవేశించినాను.

రాజు:—సజ్జనులకీమార్గము యుక్తమయినదే. ఆవయిని?

పరి:—ఆవయి నీమె యాకిరాతులనుండి వీరసేనునివద్దకును, వీరసేనునినుండి దేవిగారియొద్దకును వచ్చినది. దేవిగారి గృహము నందుఁ బ్రవేశము దొరకినతరువాత నాకీమె కానఁబడినది. నాకథ యింతటితోసరి.

మాళ:—(తనలో) భర్త యిప్పుడేమిచెప్పునో?

రాజు:—ఓహో! ఆపదలెప్పుడును బరాభవమును దెచ్చును గదా? ఎట్లనిన—

గీ. అకట! దేవి కా నర్హ్వరాలయిననీమె
దాసిగాఁ జేయఁబడె నింతదనుక నిందు
జలుగుఁ దెలికట్టుపుట్టంబు తెలివి మాలి
వడిఁ దలంటుగుడ్డగఁ జేయఁబడినయట్లు.

ధార:—అమ్మా! మాళవిక గొప్పవంశమునఁ బుట్టినదని యింతవఱకును జెప్పక నీవు తప్పుచేసితివి.

పరి:—పాపము శమించునుగాక! నేను గారణముండియే యీ సంగతి రహస్యముగా నుంచినాను.

ధార:—ఆ కారణమేది?

పరి:—ఈమెతండ్రి జీవించియుండఁగాఁ దీర్థయాత్రపరుఁడయి సిద్ధాదేశముచేత వచ్చినయొకసాధు వీమె సంవత్సరమాత్రము దాస్యము ననుభవించి తరువాతఁ దగినభర్తను బొందునని చెప్పెను. అదియవశ్య ముగా ననుభవింపవలసినదని యెఱిఁగి మీపాదసేవతో నంతమయ్యెడి యీమెయొక్క యాకాలావధిని బ్రతీక్షించుచుంటిని ఇట్లుచేయుట మంచిదనియే నేను భావించెదను.

రాజు:—అట్లు ప్రతీక్షించుట మంచిపనియే.

కంచు:—దేవా! విదర్భదేశవ్యవహారవిషయమునఁ జేయవలసిన దేమో ప్రభువువారి యభిప్రాయము వినఁగోరుచున్నానని మంత్రి మనవిచేయుచున్నాఁడు. మీరు ప్రసంగాంతరములో నుండుటచేత నాకు విన్నవించుట కవకాశము చిక్కినదికాదు.

రాజు:—మౌద్గల్యా! అన్నదమ్ములయిన యీ యజ్ఞసేన మాధవసేనులకు రాజ్యము రెండు భాగములుగాఁ బంచియిచ్చి యిప్పుడు వారినిద్దఱిని రాజ్యమునందు నిలుపఁగోరుచున్నాను.

గీ. వరదకు త్తరదక్షిణ భాగములను
వారు పాలించుకొననిమ్ము వేరు వేర
వరుసగా నలచంద్రభాస్కరులు తాము
రేయి పగలును పాలించురీతిగాను.

కంచు:—దేవా! నేనిది మంత్రిసభకు విన్నవము చేసెదను.

రాజు:—(ప్రేలితో ననుమతిని గనఁబఱుచుచున్నాఁడు.)

కంచు:—(నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రథమ:—(రహస్యముగా) ఓ రాజపుత్రీ! భాగ్యవశముచేత నీయన్నగారు రర్ధరాజ్యమునఁ బ్రతిష్ఠింపఁబడుచున్నాఁడు.

మాళ:—జీవితసంశయదశనుండి విడిపింపఁబడినందునకే మనము సంతోషింప వలయును.

[కంచుకి మరలఁ బ్రవేశించుచున్నాడు.]

కంచు:—దేవా! విజయమగును గాక! దేవరవారియాజ్ఞ మంగళ ప్రదమయినదని మంత్రిమనవిచేయుచున్నాఁడు. మంత్రి సభవారును తామీప్రకారముగా నిశ్చయించినారు.

చ. సిరిఁగయికొన్నయాతఁడలక్ష్మిని దయనిన్నరలంగ నిచ్చినట్,
బరువురథాశ్వముల్ మొదలపైని వహించెదునట్లు, దాల్చి పీ

రిరువురు నింకమీఁద నితరేతరవైరము మాని, యోనరే
శ్వర! భవదీయశాసనముఁబట్టి మెలంగుచునుందు రెప్పుడున్.

రాజు:—అట్లయినవక్షమున సేనానియైనవీరసేనున కీవిధముగాఁ జేయుమని లేఖ వ్రాసిపంపవలసినదని మంత్రిసభకుఁ జెప్పు.

కంచు:—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అని వెడలిపోయి ఒక లేఖయుఁ గానుకయుఁ బట్టుకొని మరలఁ బ్రవేశించుచున్నాఁడు) ప్రభువుగారియాజ్ఞ జరపఁబడినది. ఇదిగో సేనాపతియైన పుష్పమిత్రునియొద్దనుండి బహుమానముగాఁ బంపఁబడిన యుత్తరీయముతోఁ గూడ నీలేఖ వచ్చినది. ప్రభువువారు దీనిని జిత్తగింతురుగాక!

రాజు:—(లేచి, బహుమానము నుపచార పూర్వకముగా గ్రహించి, పరిజనము చేతికిచ్చి, లేఖను విప్పుచున్నాఁడు.)

ధార:—ఆహా! నామనస్సు లేఖమీఁద నే యున్నది. గురుజన క్షేమము తెలిసికొన్నపిమ్మట వసుమిత్రుని వృత్తాంతము వినెదను. సేనాపతి నాపుత్రునిమీఁద నతిభారమును మోపినాఁడు.

రాజు:—(కూరుచుండి చదువుచున్నాఁడు.) శ్రీరస్తు! విదిశానగరమునందున్న చిరంజీవియైన మాపుత్రుఁడగు నగ్నిమిత్రుని సేనాపతియైన పుష్పమిత్రుఁడు ప్రేమపూర్వకముగా నాలింగనము చేసికొని యజ్ఞశాలనుండి పుత్తెంచిన పత్రిక. నేను రాజయజ్ఞదీక్షితుఁడనయి యుండి నూఱువురు రాజపుత్రులను దోడిచ్చి మనవసుమిత్రునిఁ దురంగరక్షణార్థము సంవత్సరము క్రిందట నియోగించి తన మనసు వచ్చినట్లుగా సంచరించుటకయి గుఱ్ఱమును విడిచిపెట్టితిని. అది సింధునది దక్షిణతీరమునఁ దిరుగుచుండఁగా దాని నశ్వసేనాధిపతియైన యొకయవనుఁడు పట్టుకొనెను. అప్పుడుభయసేనలకును ఘోరయుద్ధము సంభవించెనని తెలియనది.

ధారి:—(విషాదమును గనఁబఱుచుచున్నది.)

రాజు:—ఏమీ! ఈవిధముగా జరిగినదా?

"గీ. అతులధన్వియౌ వసుమిత్రుఁ డడరియపుడు
చెదరఁగా దోలి శత్రుల సిగ్గుపఱిచి
వడిగ నాయుత్తమాశ్వంబు బలిమితోడఁ
దాను మరలించి తెచ్చె నిర్త్రాణుఁడగుచు."

ధారి:—ఈవాక్యముచేత నాహృదయము చల్లపడినది.

రాజు:—(మిగిలిన లేఖను జదువుచున్నాఁడు.) అంశుమంతుఁడు సగరునకశ్వమును దెచ్చి యిచ్చినట్లుగా నాపౌత్రుఁడు నాకు యజ్ఞాశ్వమును దీసికొని రాఁగా నే నిప్పుడు చేయఁ బూనినయీయజ్ఞమునకు రోషమువిడిచి నీవు వధూజనసహితముగా యుక్తసమయమున రావలెను.

రాజు:—నాకిదియనుగ్రహము.

పరి:—భాగ్యవశమునఁ బుత్త్రవిజయముచేత దంపతులు వర్ధిల్లుచున్నారు. (ధారణివంకఁజూచి)

గీ. భర్తచేతను దగవీరపత్నులందుఁ
బ్రథమగణ్యవై శ్లాఘ్యతఁ బడసితీవు;
మఱియునిప్పుడు నీకుమారునివలన
వీరమాతవునైతి వోవెలఁదిమిన్న.

ధార:—అమ్మా! కొడుకు తండ్రినిఁబోలినవాఁ డయినందుల కానందభరితురాల నయినాను.

రాజు:—మౌద్గల్యా! ఏనుఁగుపిల్ల యూథపతి ననుసరించినది సుమా!

కంచు:—గీ. అంబువులఁ బిల్చునగ్నికి నోర్వసట్ల
జననకారణమీవైన ఘనతచేత
నితనివీరవిచేష్టిత మేముచూచి
డెందమున విస్మయంబును బొంద మిందు.

రాజు:—మౌద్గల్యా! చెఱసాలలోనున్న యజ్ఞసేనుని మఱిది మొదలయినవారి నందఱిని విడుదలచేయింపుము.

కంచు:—దేవరవారానతిచ్చినట్లు చేయించెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

ధార:—జయసేనా! నీవుపోయి యిరావతి మొదలయిన యంతఃపురకాంతల కందఱికిని నాపుత్త్రుని విజయవార్తలు దెలుపుము.

ప్రతీ:—ఆలాగున జేసెదను. (అని బయలుదేఱుచున్నది.)

ధార:—కొంచె మిటురమ్ము.

ప్రతీ:—(వెనుకమరలి) ఇదిగోవచ్చినాను.

ధార:—(రహస్యముగా) నేనశోకదోహదమునకుఁ నియోగించి నప్పుడు మాళవికకుఁ జేసిన నాప్రతిజ్ఞను, ఆమె సద్వంశసంభవతయుఁ జెప్పి, నాసత్యము నీమూలమున నిలువవలెనని యిరావతిని నామాటలుగా నూఱడింపుము.

ప్రతీ:—దేవియాజ్ఞాపించినట్లు చేసెదను. (అని వెడలిపోయి మరలఁ బ్రవేశించి) అమ్మా! నీపుత్త్రవిజయనిమిత్తమున సంతోషించి యంతఃపురకాంతలిచ్చిన యాభరణములకు నేను బెట్టె నయినాను.

ధార:—చాలును. ఇందాశ్చర్యమేమున్నది? ఈయభ్యుదయము నాకును వారికిని సామాన్యమయినదే.

ప్రతీ:—(రహస్యముగా) అమ్మా! "పెద్దవారయిన మీనోటి నుండివచ్చినమాట యోగ్యమయినది. మీసంకల్పమును మార్చుకొనుట యుక్తముకాదు." అని యిరావతి మనవిచేయుమన్నది.

ధార:—అమ్మా! ప్రథమమునఁ బూజ్యుఁడయిన సుమతిచేత నియ్యసంకల్పింపఁబడిన యీమాళవికను భర్తగారి కిచ్చుటకయి మీ యనుమతమును గోరుచున్నారు. ఇప్పుడునహితము నీవే యీమెకు యజమానురాలవు.

ధార:—(మాళవికను జేతితోఁ బట్టుకొని) నాకుఁ బ్రియవార్తను దెలిపినందుకొరకయి భర్తగారు నీమెను బారితోషికముగా నంగీకరింతురుగాక!

రాజు:—(సిగ్గుపడుచున్నాఁడు.)

ధార:—(చిఱునవ్వుతో) చేసిన ప్రియనివేదనమున కీపారితోషికము తగదని భర్తగారు తిరస్కరించుచున్నారేమి?

విదూ:—అమ్మా! క్రొత్తపెండ్లికొడుకు లందఱును లజ్జపడుదురన్న లోకప్రవాదము విన్నదేకదా?

రాజు:—(విదూషకునివంకఁ జూచుచున్నాఁడు)

విదూ:—దేవిగారే యీమెకుఁ దమతో సమానముగా దేవీసంజ్ఞ నిచ్చినతరువాతనే యీయన మాళవికను బ్రతిగ్రహింపఁ గోరుచున్నాఁడు.

ధార:—దేవీనామము రాజపుత్రికయయిన యీమెకు సత్కులోద్భవత్వముచేతనే యియ్యఁబడినది. పునరుక్తిచే నేమిప్రయోజనము?

పరి:—అట్లుకాదు.

క. గనిలోఁ బుట్టిన దయ్యును;
నొనరంగా సానపట్టకున్నను మణియుం
గనకముతో సంయోగం
బొనగూర్పఁగ నర్హమౌనె? యోకళ్యాణీ!

ధార:—అమ్మా! ఈయభ్యుదయకథచేత మొదట నీమె మేలిముసుఁగుసంగతిచూడలేదు క్షమింపుము. నీవుపోయి మేలిముసుఁగునకయి పట్టువస్త్రమును దీసికొనిరమ్ము.

ప్రతీ:—దేవిగా రాజ్ఞాపించినట్లుచేసెదను (అని ముసుఁగుచీరనుదీసికొని మరలఁ బ్రవేశించి) దేవీ! ఇదిగో. (అని యిచ్చుచున్నది)

ధార:—(మాళవికకు ముసుఁగు వేసి) ప్రాణేశ్వరా! ఈమెను బ్రతిగ్రహింపవలెను.

రాజు:—నేను నీశాసనమును మీఱరానుగనుక నీదానమును స్వీకరించినాఁడను.

విదూ:—ఆహా! ఏమి యీ ధారణీదేవి యనుకూలత!

ధార:—(పరిజనము వంకఁ జూచుచున్నది)

పరి:—(మాళవికను సమీపించి) అమ్మా! జయముగుఁగాక! జయముగుఁగాక!

ధార:—(పరివ్రాజిక వంకఁ జూచుచున్నది)

పరి:—దేవి! ఇది నీకు వింత కాదు.

గీ. పతులసేవింత్రు ప్రతిపక్షసతుల నిచ్చి
యొనఁ బతిభక్తి తత్పర లైన సతులు,
నదుల నేకములగు నేటియుదకములను
గొంచుఁ బోయి సముద్రునిఁ గూర్చునట్లు.

[నిపుణిక ప్రవేశించుచున్నది.]

నిపు:—దేవా! జయముగుఁగాక! జయముగుఁగాక! "అత్యధిక చాపలాతిశయముచేత నేను భర్తగారియెడ నపరాధము చేసినాను. అయినను నేనటుతరువాత భర్తగారికి స్వయముగానే యనుకూలము చేసినాను. ఇప్పుడు భర్తగారు సంపూర్ణ మనోరథులయినారు గనుక, నన్నుఁగూడఁ బ్రసాదమాత్రముచేత సంభావింపఁదగును" అని యిరావతి విన్నపము చేయుచున్నది.

ధార:—నిపుణికా! "భర్తగారు నీవుచేసిన సేవకుఁ దగినఫలమును బ్రసాదింతురు" అని యిరావతితోఁ జెప్పుము.

నిపు:—నాకిది పరమానుగ్రహము.

(అని నిష్క్రమించుచున్నది)

పరి:—దేవా! మీతోడివివుపనిసంబంధముచేతఁ గృతార్థుఁడయిన మాధవసేనునిఁ దమసెలవుమీఁదఁబోయి సందర్శించి నేత్రసాఫల్యమును బొందఁగోరుచున్నాను.

ధార:—అమ్మా! మీరు మమ్ము విడిచిపెట్టుట తగదు.

రాజు:—అమ్మా! నీక్షేమవార్తను మా లేఖలలో లిఖించి యాతని తావునకు మానసభాజనులను బంపెదను.

పరి:—మీయిరువుర యాదరముచేతను నేను ధన్యురాలనయి నాను.

ధార:—ప్రాణేశ్వరా! నేనింకను దమకేమి చేయవలెనో యాజ్ఞాపింపుఁడు.

రాజు:—నాకిదియే ప్రియము.

ఉ. దేవి! ప్రసన్నురాలవయి తియ్యనిచూపు సతంబు నాపయిన్;
నే వచియింతు నియ్యదియు నీప్రతిపక్షజనంబుఁబట్టి యో
పావని! యగ్నిమిత్రుఁ డిల పాలనచేసెను సంతగాలమున్
భూవలయంబునం బ్రజకుఁబుట్టకయుండుత మీతిబాధలున్.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

సంపూర్ణము.

రాజమండ్రి: శ్రీరామమద్రాక్షరశాలయందు ముద్రితము:—1[illegible]